ఐపీఎల్‌కు స్టేడియం ముస్తాబు

- మారుతున్న ఏసీఏ వీడీసీఏ స్టేడియం రూపురేఖలు



రూ.40 కోట్లతో అభివృద్ధి పనులు

- ఈ నెల 24, 30 తేదీల్లో ఐపీఎల్ మ్యాచ్‌లకు సిద్ధం
- ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని

-8లో

కాంట్రాక్టు ఉద్యోగికి పర్యాటక పగ్గాలు!

జిల్లా పర్యాటక శాఖాధికారిగా గరికిన దాసు

- అల్లూరి జిల్లా బాధ్యతలు కూడా అప్పగింత
- గైడ్‌గా చేరి డీటీఓ స్థాయికి....
- రాష్ట్రంలో పర్యాటకంగా అత్యంత ఆదరణ కలిగిన రెండు జిల్లాలకు ఇన్‌చార్జిగా నియమించడంపై విస్మయం
- తీరుమారని పెద్దలు... తప్పుల మీద తప్పులు



డీటీఓ దాస్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అవినీతి, అక్రమాలతో నిండిన పర్యాటక శాఖను ప్రక్షాళన చేయాలని కూటమి నేతలు కోరుతున్నా పెద్దలు పట్టించుకోవడం లేదు. పైగా మరిన్ని తప్పటడుగులు వేస్తున్నారు. విశాఖపట్నం జిల్లా పర్యాటక శాఖ అధికారిగా గరికిన దాసును నియమించడమే అందుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు.

విశాఖపట్నానికి రాష్ట్ర పర్యాటక రాజధానిగా పేరు ఉంది. ఇక పక్కనే ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యంత ప్రజాదరణ కలిగిన అరకులోయ, బొర్రా గుహలు ఉన్నాయి. రాష్ట్రంలో పర్యాటక శాఖకు అత్యంత ప్రధానమైన ఈ రెండు జిల్లాలకు అధికారిగా ఒక కాంట్రాక్టు ఉద్యోగి (గరికిన దాసు)ని నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. విశాఖపట్నం జిల్లా పర్యాటక శాఖ అధికారి హోదాలో పనిచేయాలని సూచించారు. దాసుది విశాఖపట్నం జిల్లానే. 2004లో గైడ్‌గా పర్యాటక శాఖలో చేరారు. కాంట్రాక్టు ఉద్యోగిగా మారారు. ఆ తరువాత అసిస్టెంట్ టూరిజం అధికారి(ఏటీఓ)గా పదోన్నతి సాధించారు. అక్కడితో ఆగకుండా మేనేజర్ అయ్యారు. ఆ తరువాత ఏకంగా జిల్లా పర్యాటక శాఖ అధికారి (డీటీఓ)గా బాధ్యతలు చేపట్టారు. మొన్నటి వరకు విజయనగరం జిల్లా పర్యాటక శాఖ అధికారిగా ఉంటూ...అక్కడకు 150 కి.మీ. దూరానున్న అల్లూరి సీతారామరాజు జిల్లా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ఇప్పుడు ఆయన్ను విశాఖ డీటీఓగా నియమించారు. అల్లూరి జిల్లా అదనపు బాధ్యతలు కొనసాగించనున్నారు.




మంగమారిపేటలో దుకాణాలు తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

అనేక ఆరోపణలు.. వివాదాలు

దాసు చాలాకాలంగా పర్యాటక శాఖలో పనిచేస్తున్నా ఆయన కాంట్రాక్టు ఉద్యోగి. అలాంటి వ్యక్తికి కీలకమైన రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించారంటే ఏమనాలో ఇక్కడి ప్రజాప్రతినిధులకు అర్థం కావడం లేదు. రుషికొండ బీచ్‌లో ముందు 40 దుకాణాలు ఉండేవి. ఇప్పుడు అవి వందకు పైగా ఉన్నాయి. వీటి సంఖ్య ఇంతలా పెరగడం వెనుక దాసు హస్తం ఉందనేది శాఖలో సిబ్బంది మాట. అదే బీచ్‌లో ఆయన భార్య పనిచేస్తున్నారు. రుషికొండ బీచ్ నిర్వహణ బాధ్యతలను ఇంతకు ముందు ఓ ప్రైవేటు సంస్థ చూసేది. వారు 50 మందిని నియమించుకొని బీచ్‌ను పరిశుభ్రంగా ఉంచేవారు. అలా అందులో ఒకరిగా చేరిన దాసు భార్య టిక్కెట్ కలెక్షన్ బాధ్యతలు చూసేవారు. ఆరోపణలు రావడంతో ఆమెను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. దాంతో ఆ బీచ్‌లో అధికారులకు వ్యతిరేకంగా ఓ వర్గం తయారైంది. అది దాసుకు అనుకూల వర్గమనే ప్రచారం ఉంది.

ఇదిలావుండగా మంగమారిపేటలో బీచ్‌ను ఆనుకొని పర్యాటక శాఖ స్థలం ఉంది. అక్కడ కూడా అనధికారికంగా చాలా దుకాణాలు వెలిశాయి. వాటన్నింటినీ గత డీటీఓ జ్ఞానవేణి పోలీసుల సాయంతో తొలగించారు. ఆ సమయంలో స్థానిక మత్స్యకారులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, పర్యాటక ప్రాజెక్టు వస్తుందని, అందుకని ఖాళీ చేయిస్తున్నామని ఆమె చెప్పారు. దుకాణాల ఏర్పాటువెనుక దాసు హస్తం ... మిగతా 6వ పేజీలో

నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు రాక



విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బుధవారం రాత్రి విశాఖపట్నం వస్తున్నారు. రాత్రి 11.30 గంటలకు విమానంలో ఇక్కడికి వచ్చి పార్టీ కార్యాలయం ఆవరణలో బస చేస్తారు. మరుసటిరోజు పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆయన తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన ప్రపంచ చరిత్ర పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం గురువారం గీత యూనివర్సిటీలో ఉంది. దానికి హాజరు అవుతారు. ఇతర అధికారిక కార్యక్రమాలు ఇంకా వెల్లడించలేదు.

ఆర్థిక శాఖా మంత్రి రాక రేపు



కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ నగరానికి వస్తున్నారు. గురువారం మధ్యాహ్నం నోవాటెల్‌లో జరిగే పోస్ట్ బడ్జెట్ కార్యక్రమంలో ఆమె పాల్గొంటారు. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి కూడా హాజరవుతారు.

ముగిసిన ఎన్నికల కోడ్

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియ ముగియడంతో కోడ్ ఎత్తివేసినట్టు రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కోడ్ ఎత్తివేసినట్టు పేర్కొన్నారు. కోడ్ వల్ల నిలిచిపోయిన అనేక కార్యక్రమాలు ఇకపై యథావిధిగా జరుగుతాయన్నారు. కాగా జనవరి 29న ప్రారంభమైన ఎన్నికల కోడ్ మంగళవారం వరకూ కొనసాగింది.

ఉక్కులో బిక్కుబిక్కు

భద్రతకు తిలోదకాలు



- నిర్వహణ పనులకు స్వస్తి పలికిన యాజమాన్యం
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన
- పూర్తిస్థాయి సీఎండీ లేకపోవడంతో ప్లాంటులో కొరవడిన పర్యవేక్షణ

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం స్టీల్ ప్లాంటు పరిస్థితి ఎప్పుడు ఎలా ఉంటుందో తెలియని వాతావరణం నెలకొంది. సిబ్బంది కుదింపుపై దృష్టిపెట్టిన ఉక్కు మంత్రిత్వ శాఖ ప్లాంటు నిర్వహణను పక్కనపెట్టేసింది. ప్లాంటులో మరమ్మతులు, విడిభాగాలు అమరిక వంటి పనులన్నీ గత కొంతకాలంగా స్తంభించిపోయాయి. దాంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కేపిటల్ రిపేర్లు చేయించకుండా మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తుండడంపై కార్మిక సంఘాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లనే నష్టాలు వచ్చాయని ప్రకటించిన ప్రభుత్వం నెలలు గడుస్తున్నా కొత్తవారిని తీసుకురావడం లేదు. ప్రస్తుతం సీఎండీగా ఉన్న అధికారి వారంలో రెండు రోజులు కూడా పూర్తిగా విశాఖపట్నంలో ఉండడం లేదంటున్నారు. ఆయనకు వేరే ప్రధాన ఉద్యోగం ఉంది. ఇది అదనపు బాధ్యత. కేంద్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు సాయం అందించిన ప్లాంటును ఓ తాత్కాలిక అధికారితో ఆరు నెలలుగా నడిపిస్తున్నారు. ప్లాంటులో పూర్తి స్థాయి ఆపరేషన్ డైరెక్టర్ లేరు. గతంలో 15 మంది ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఉండేవారు. ఇప్పుడు ఒక్కరూ లేరు. చీఫ్ జనరల్ మేనేజర్లు 64 మంది ఉండేవారు. ఇప్పుడు ఐదుగురే మిగిలారు. జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదని, పదోన్నతులు లేవని సుమారు 700 మంది యువ అధికారులు రాజీనామా చేసి వెళ్లిపోయారు. ఇటువంటి తరుణంలో 1,100 మందికి వీఆర్ఎస్ ఇచ్చి పంపించబోతున్నారు. రాబోయే రెండేళ్లలో మరో మూడు వేల మంది పదవీ విరమణ చేయనున్నారు. ఇలా అధికారులు, కార్మికుల సంఖ్య తగ్గిపోతున్నా...మిగిలిన వారితోనే పూర్తిస్థాయి ఉత్పత్తి సాధించాలని మంత్రిత్వ శాఖ ఒత్తిడి పెడుతోంది.

నిర్వహణ చాలా ముఖ్యం

సముద్ర తీర ప్రాంతంలో స్టీల్‌ప్లాంటు ఉండడం ఒక విధంగా లాభదాయకం అయినప్పటికీ నిర్వహణపరంగా సవాల్. ప్లాంటులో అన్నీ స్టీల్‌తో చేపట్టిన నిర్మాణాలే. ఉప్పుగాలికి తుప్పు పట్టకుండా నిత్యం పెయింటింగ్ వేస్తుండాలి. ప్లాంటులో ముడి పదార్థాల రవాణా అంతా కన్వేయర్ బెల్ట్‌ల ద్వారానే జరుగుతోంది. ఉక్కు తయారీలో ద్రవపు ఉక్కును రవాణా చేస్తారు. పలు విష వాయువులు వెలువడతాయి. కిలోమీటర్ల కొద్దీ పైపుల ద్వారానే ప్రయాణిస్తాయి. వీటిని నిరంతరం తనిఖీ చేస్తూ, అవసరమైతే మరమ్మతులు చేయాలి. కోక్ ఓవెన్, థర్మల్ పవర్ ప్లాంటు, సింటర్ ప్లాంటు, బ్లాస్ట్ ఫర్నేసులు, స్టీల్ మెల్ట్ ... మిగతా 6వ పేజీలో

ద్వితీయ ప్రాధాన్య ఓట్లతోనే విజయం

- గ్రాడ్యుయేట్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆది నుంచి అదే వరుస
- 2007లో శాసన మండలి పునరుద్ధరణ తరువాత నాలుగుసార్లు ఎన్నికలు
- ప్రతిసారీ రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో అభ్యర్థులకు దక్కిన విజయం

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తుది ఫలితం ఆది నుంచి ద్వితీయ ప్రాధాన్య ఓట్లతోనే నిర్ణయమవుతోంది. శాసన మండలిని 2007లో పునరుద్ధరించిన తరువాత ఇప్పటివరకూ నాలుగుసార్లు చొప్పున పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా...ప్రతిసారి రెండో ప్రాధాన్య ఓట్లతోనే అభ్యర్థులు విజయం సాధిస్తూ వస్తున్నారు.



గాదె శ్రీనివాసులునాయుడు

మండలి పునరుద్ధరణ తరువాత తొలిసారి 2007లో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు, పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎంవీఎస్ శర్మ రెండో ప్రాధాన్య ఓటుతోనే విజయాన్ని దక్కించుకున్నారు. అనంతరం 2011లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంవీఎస్ శర్మ, 2013లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె శ్రీనివాసులునాయుడు రెండోసారి రెండో ప్రాధాన్య ఓటుతోనే గెలుపొందారు. 2017లో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీవీఎన్ మాధవ్, 2019లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పాకలపాటి రఘువర్మ రెండో ప్రాధాన్య ఓటుతో గెలిచి మండలిలో అడుగుపెట్టారు. అలాగే, 2023లో జరిగిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో వేపాడ చిరంజీవిరావు రెండో ప్రాధాన్య ఓట్లతోనే విజయాన్ని దక్కించుకోగా, తాజాగా జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గాదె మూడోసారి రెండో ప్రాధాన్య ఓటుతో విజయాన్ని సాధించారు.


రుషికొండ బీచ్‌లో పూణే బృందం తనిఖీలు

- 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపు పునరుద్ధరణకు ఈ బృందం ఇచ్చే నివేదికే కీలకం

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని రుషికొండ బీచ్‌లో సరైన వసతులు, పరిశుభ్రత లేని కారణంగా 'బ్లూ ఫ్లాగ్' గుర్తింపును తాత్కాలికంగా ఉపసంహరించిన నేపథ్యంలో పునరుద్ధరణకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో భాగాంగా పూణేకు చెందిన సంస్థ రోయల్ లైఫ్ సేవింగ్ సొసైటీ మంగళవారం బీచ్‌కు వచ్చి తనిఖీలు నిర్వహించింది. ఇక్కడ బీచ్‌లో పర్యాటకులు మునిగిపోతే ఎలా రక్షిస్తారు?...అనే అంశంపై లైఫ్‌గార్డులను అడిగి తెలుసుకుంది. వారికి వృత్తిపరమైన అవగాహన ఉందా?,లేదా? అని పరీక్షించింది. ఇం కా మరో రెండు ఇతర అంశాలను కూడా పరిశీలించనున్నది. వీరు సమర్పించే నివేదిక ఆధారంగా బ్లూ ఫ్లాగ్ గుర్తింపు పునరుద్ధరణపై చర్యలు తీసుకుంటారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం రాక

- నేటి నుంచి నగరంలో రహస్యంగా పర్యటన
- పారిశుధ్య నిర్వహణ, చెత్త తరలింపు వంటివి పరిశీలన
- జీవీఎంసీ అధికారులు అప్రమత్తం



విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్-2024 సర్వేలో భాగంగా కేంద్ర ప్రభుత్వ బృందం మంగళవారం రాత్రి నగరానికి చేరుకుంది. బుధ లేదా గురువారం నుంచి నగరంలో పారిశుధ్య నిర్వహణ, చెత్త సేకరణ, తరలింపు, మరుగుదొడ్ల నిర్వహణ వంటి వాటిని బృందం పరిశీలించనున్నది. అలాగే పలు ప్రాంతాల్లోని నివాసాలు, మార్కెట్‌లకు వెళ్లి అక్కడ జీవీఎంసీ పారిశుధ్య నిర్వహణ తీరు, సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై ప్రజలు, వ్యాపారుల నుంచి అభిప్రాయాలను సేకరించనున్నది. స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సంబంధించిన పలు ప్రశ్నలను కూడా ప్రజలను అడిగే అవకాశం ఉంది.

ఢిల్లీ నుంచి వచ్చిన సర్వే బృందం తమ పర్యటన వివరాలను జీవీఎంసీ అధికారులకు కూడా వెల్లడించదు. తాము సర్వే చేసిన ప్రాంతంలో ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలతోపాటు తాము పరిశీలించిన ప్రాంతంలోని పరిస్థితులు, పారిశుధ్య నిర్వహణకు సంబంధించిన అంశాలపై నివేదికను తయారుచేసి జీవీఎంసీ అధికారుల ధ్రువీకరణతో ఢిల్లీలోని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ అధికారులకు పంపిస్తుంది. స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం రాక నేపథ్యంలో జీవీఎంసీ అధికారులు ఇప్పటికే అప్రమత్తమయ్యారు. నగరంలో పారిశుధ్య నిర్వహణ పక్కాగా జరిగేలా, రోడ్లు శుభ్రంగా ఉండేలా, డ్రైనేజీల్లో డీసిల్టేషన్ పనులు సవ్యంగా సాగేలా, డ్రైనేజీ పాడైపోయిన చోట పునర్నిర్మాణం వెంటనే చేపట్టేలా ప్రజారోగ్య విభాగం, ఇంజనీరింగ్ విభాగం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

అరకొర వేతనాలతో 102 ఉద్యోగుల వెతలు

- కేవలం రూ.7,600 నుంచి రూ.7,800 మాత్రమే చెల్లింపు
- ఉద్యోగాలు వదిలి వెళ్లిపోతున్న పైలట్లు
- నిలిచిపోతున్న వాహనాలు
- కనీసం రూ.18 వేలు అయినా చెల్లించేలా చూడాలని వేడుకోలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

చాలీచాలని వేతనాలతో తల్లి,బిడ్డ ఎక్స్‌ప్రెస్ (102)ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడిచిన ఎనిమిదేళ్ల నుంచి ఈ వాహనాలకు పైలట్లుగా పనిచేస్తున్న వారికి ఏజెన్సీ సంస్థ కేవలం రూ.7,600 నుంచి రూ.7,800 మాత్రమే చెల్లిస్తోంది. ప్రసవం కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేందుకు, తిరిగి వెళ్లేందుకు నిరుపేదలు ఎంతో ఇబ్బందిపడుతుండేవారు. ఈ నేపథ్యంలో ప్రసవం అనంతరం తల్లి,బిడ్డలను సురక్షితంగా, ఉచితంగా ఇంటికి ... మిగతా 6వ పేజీలో


రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.07
సహరి (గురు)	4.56

పంచాయతీలకు మొండిచేయి

అందని రిజిస్ట్రేషన్ల ఆదాయం

- రెండేళ్లుగా పెండింగ్
- గత వైసీపీ పాలకుల నిర్వాకం
- కూటమి ప్రభుత్వమైనా నిధుల విడుదలకు ముందుకు రావాలని సర్పంచుల వినతి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గ్రామ పంచాయతీలను వైసీపీ ప్రభుత్వం అన్నివిధాలుగా నిర్వీర్యం చేసింది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే ఫైనాన్స్ కమిషన్ నిధులను దారిమళ్లించడమే గాకుండా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన పలు రకాల గ్రాంట్లను కూడా నిలిపివేసింది. అందులో కీలకమైనది రిజిస్ట్రేషన్స్ ఆదాయం. పంచాయతీల పరిధిలో భూముల క్రయ విక్రయాల సందర్భంగా ప్రభుత్వానికి చెల్లించే రిజిస్ట్రేషన్ ఫీజుల్లో ఆయా పంచాయతీలకు వెళ్లాల్సిన వాటాను విడుదల చేయలేదు. దీంతో పంచాయతీలు ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యాయి.

జిల్లాలోని నాలుగు మండలాల పరిధిలో పంచాయతీలకు ఏడాదికి రమారమి రూ.ఏడు కోట్ల వరకు రిజిస్ట్రేషన్ ఆదాయం వస్తుంది. కొన్ని పంచాయతీలకు మూడేళ్ల నుంచి, మరికొన్ని పంచాయతీలకు రెండేళ్ల నుంచి రిజిస్ట్రేషన్ ఆదాయం అందలేదని సర్పంచులు చెబుతున్నారు. విశాఖ నగరానికి ఆనుకుని ఉన్న పంచాయతీల్లో ఎక్కువగా క్రయ విక్రయాలు జరుగుతాయి. కొన్ని పంచాయతీల్లో భూములు చదరపు గజాలుగా, ఎక్కువ పంచాయతీల్లో సెంట్లుగా రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఫీజుల్లో 40 శాతం ప్రభుత్వ ఖాతాకు, 30 శాతం గ్రామ పంచాయతీలకు, 30 శాతం మండల/జడ్పీ ఖాతాకు జమ కావాలి. 2021 ఏప్రిల్‌లో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. సర్పంచులుగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులకు వైసీపీ ప్రభుత్వం అనేక రకాల ఇబ్బందులు సృష్టించింది. కేంద్రం నుంచి వచ్చే ఫైనాన్స్ కమిషన్ నిధులు ఇవ్వలేదు. రెండో విడత వచ్చిన నిధులను విద్యుత్ బకాయిల పేరిట జమ చేసుకున్నామని ప్రకటించినా...ఇంతవరకూ వాటికి సంబంధించి వివరాలు వెల్లడించలేదు. అదేవిధంగా న్యాయపరంగా అందాల్సిన రిజిస్ట్రేషన్ల ఆదాయం పంచాయతీ ఖాతాకు జమ చేయలేదు. సర్పంచులుగా ఎన్నికైన వారిలో పలుకుబడి ఉన్న వారు విజయవాడ వెళ్లి పంచాయతీరాజ్ కమిషనర్‌ను కలవగా 2021-22, 2022-23 సంవత్సరాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ల ఆదాయం వారి పంచాయతీలకు మాత్రమే జమ చేశారు. మిగిలిన పంచాయతీలను వదిలేశారు. అంతేకాకుండా 2023-24 రిజిస్ట్రేషన్ ఆదాయం ఏ పంచాయతీకీ విడుదల చేయలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా ఇంతవరకూ ప్రభుత్వం పైసా ఇవ్వలేదు. గ్రామ పంచాయతీల ఖాతాలో రిజిస్ట్రేషన్ల ఆదాయాన్ని సాధారణ నిధుల కింద జమ చేస్తారు. వీటిని పలు రకాల అభివృద్ధి, పారిశుధ్య నిర్వహణ, తదితర పనులకు ఖర్చు చేస్తారు.

జిల్లాలోని 79 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జీవీఎంసీకి ఆనుకుని ... మిగతా 6వ పేజీలో

క్వారీ తవ్వకాల్లో నిబంధనలు బేఖాతర్

» ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి » కార్మికుల భద్రతా అంతంత మాత్రమే.. » నోరు మెదపని గనుల శాఖ అధికారులు



జొన్నాడ సమీపంలో కొండ క్వారీ

భీమునిపట్నం (రూరల్) మార్చి 04 (ఆంధ్రజ్యోతి) : భీమిలి నియోజకవర్గం పరిధిలో వివిధ ప్రాంతాల్లో కొండల నుంచి మట్టి రాళ్లను తవ్వే క్వారీల వల్ల ప్రభుత్వాదాయానికి భారీగా గండి పడుతోంది. భీమిలి ఆనందపురం పద్మనాభం మండలాల్లో ఉన్న 16 క్వారీల్లో నిబంధనలను పాటించకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గనుల శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం అక్రమదారులకు వరంగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారులు మౌనం వహిస్తుండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారని, క్వారీల్లో అనేక అవకవతకలు జరుగుతున్నా వెలుగులోకి రావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ క్వారీల ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం వస్తున్నా ప్రభుత్వానికి జమ అవుతున్న సొమ్ము మాత్రం రూ.వేలల్లో కూడా ఉండటం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా ఈ క్వారీల్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొన్ని వెలికి రావడం లేదు. గండిగుండం వద్ద ఒక కార్మికుడు గతంలో చనిపోయాడు. పేకేరు, బోడమిట్టపాలెం, కురపల్లి, గంభీరం వంటి గ్రామాల్లో ఉన్న క్వారీల్లో క్షతగాత్రులు అయినవారు చాలామంది ఉన్నారు. కొండలను తవ్వి రాళ్ల, మట్టి తీసుకోవడానికి కార్మికుల పేరుతో ఏర్పడిన సొసైటీలు ముందస్తుగా అనుమతులు తీసుకోవాలి. కానీ చాలా క్వారీలు నిబంధనలు పాటించకుండా మట్టిని, రాళ్లను తరలిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో కార్మికుల పేరుతో బినామీలు, రాజకీయ నాయకులు ఈ క్వారీలను నడుపుతున్నారు

రెండు రకాల క్వారీలలో ప్రమాదాలు

కొండల నుంచి మట్టి తవ్వడానికి, రాళ్లను తవ్వడానికి రెండు రకాల క్వారీలు నిర్వహిస్తుంటారు. మట్టి తవ్వడం, లారీలకు ఎత్తుకోవడం, డంపింగ్ చేయడం వంటి పనులకు కూడా అనుమతులు ఉండాలి. కానీ ఆనందపురం మండలంలో జగన్నాథపురం, కోలవానిపాలెం, దుక్కవానిపాలెం, శొంఠ్యాం తదితర ప్రాంతాల్లో అనధికారికంగా మట్టిని తరలిస్తున్నారు. ఇంక బండరాళ్ల విషయంలో కూడా నాలుగు ప్రధాన క్వారీలలో అసలు నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాళ్లను బద్దలు కొట్టడానికి వీరు బాంబులను వినియోగిస్తుంటారు. ఈ సమయంలో చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయాలి. పేలిన రాళ్లు దూరంగా పడినప్పుడు ప్రమాదాలు జరుగుతుంటాయి. అయితే చాలా క్వారీల్లో రాత్రి పూట ఈ పనులు చేస్తుంటారు. ఈ క్వారీలు నిర్వాహకులకు లాభాలు తెచ్చిపెడుతున్నాయి. లోడు మట్టి రూ.10 వేలు నుంచి రూ.14 వేలు వరకు ధర పలుకుతుండగా, లోడు రాయి రూ.పది వేల ధర పలుకుతోంది. ప్రతి రోజూ ఒక లారీ ద్వారా కనీసం 20 లోడ్లు మట్టిని తరలించవచ్చు. కానీ సీనరేజిగా అధికారులకు వస్తున్న ఆదాయం మాత్రం నామమాత్రంగా ఉంటోంది. ఈ రాళ్లను కొట్టడం లారీల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేయడానికి పనిచేసే కార్మికులకు రోజుకు వెయ్యి రూపాయల వరకు ఆదాయం వస్తుంది. అందువల్ల ఎక్కువమంది ఈ క్వారీలలో పని చేయడానికే ఇష్టపడుతుంటారు. అయితే ఈ కార్మికుల భద్రతకు ఆయా క్వారీ నిర్వాహకులు తీసుకొంటున్న చర్యలు తగు మాత్రమేనని చెప్పారు.

పరిమితికి మించి తవ్వకాలు

నిబంధనలు పాటించని క్వారీలపై చర్యలు తీసుకుంటున్నామని ప్రకటించిన అధికారులు గతంలో గంభీరం సమీపంలో ఉన్న మూడు క్వారీల లైసెన్సులను రద్దు చేశారు. సాధారణంగా క్వారీల లీజు మూడేళ్లకు ఇస్తుంటారు.. క్వారీల లీజుగా ఏడాదికి రూ.50 వేలు నుంచి రూ.3 లక్షల వరకు వసూలు చేస్తుంటారు. అయితే నిర్ణయించిన సర్వే నంబర్లలలో పరిమితికి లోబడి మాత్రమే క్వారీలో తవ్వకాలు జరపాలి. కానీ, క్వార కాంట్రాక్టుదారులు లీజు కాలంలో వందలాది లారీలతో ఎన్నో లోడులు తరలిస్తుంటారు. కొండ క్వారీల కోసం ఇచ్చిన లీజలు విషయంలో కూడా పునఃపరిశీలించలని పలువురు కోరుతున్నారు. ముఖ్యంగా క్వారీల్లో జరుగుతున్న ప్రమాదాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు.



రామానాయుడుపేట వద్ద క్వారీ

ఉక్కులో బిక్కుబిక్కు

... 5వ పేజీ తరువాయి

షాపు, రోలింగ్ మిల్స్‌తో పాటు అనేక అనుబంధ విభాగాలు భారీ షెడ్లలో నిర్వహిస్తున్నారు. నిధులు లేవనే కారణంతో గత రెండేళ్లుగా నిర్వహణ పనులు చేపట్టలేదు. ఇంకా దారుణం ఏమిటంటే ఇటీవల సివిల్ ఇంజనీరింగ్ విభాగాన్ని మూసేసి, అక్కడి ఉద్యోగులను స్ట్రక్చరల్ విభాగానికి తరలించారు. నిర్వహణ లోపం, ఒత్తిడి వల్ల ఎక్కడైనా ఏదైనా జరిగితే పదుల సంఖ్యలో ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం భద్రతా దినత్సోవం నిర్వహించారు. అసలైన భద్రత గురించి చర్చించలేదు. ఇప్పటికైనా తగిన నిర్వహణ పనులు చేపట్టి, ఆపైనే పూర్తి ఉత్పత్తికి వెళ్లాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

కాంట్రాక్టు ఉద్యోగికి పర్యాటక పగ్గాలు!

... 5వ పేజీ తరువాయి

ఉందనే ఆరోపణలు కూడా వచ్చాయి. సంస్థ పరువు పోయేలా వ్యవహరిస్తున్నారని వైసీపీ హయాంలో దాసును ఈ జిల్లా నుంచి బయటకు పంపించేశారు. ఇప్పుడు ఆయనే కూటమి ప్రభుత్వానికి ముద్దుగా కనిపించడంతో తీసుకువచ్చి రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. విశాఖకు ఎంతోమంది విదేశీ పర్యాటకులు, రాయబారులు, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు వస్తారు. వారితో డీటీఓ హోదాలో దాసు చర్చలు జరపగలరా?, ప్రాజెక్టులపై ఉన్నతాధికారులకు నివేదికలు ఇవ్వగలరా?...అంటే ఆ శాఖలో ఎవరూ నోరు విప్పడం లేదు. అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అత్యంత కీలకమైన ప్రాంతంలో బాధ్యతలు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రజా ప్రతినిధులైతే నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు నియమించాలని తాము కోరితే...ఏరికోరి ఆరోపణలు ఉన్నవారిని నియమిస్తున్నారని, తెర వెనుక ఏమి జరుగుతున్నదో అర్థం కావడం లేదని వాపోతున్నారు.

పంచాయతీలకు మొండిచేయి

... 5వ పేజీ తరువాయి

ఆనందపురం, భీమిలి, పెందుర్తి మండలాల్లో మెజారిటీ పంచాయతీలు, పద్మనాభం మండలంలోని కొన్ని పంచాయతీల్లో భూముల విలువ ఎక్కువ. వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో క్రయ విక్రయాలు చదరపు గజాల్లో జరుగుతాయి. నగరానికి ఆనుకుని భూముల ధరలు ఎకరా రూ.కోట్లలో పలుకుతుండడంతో రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా భారీగానే వస్తోంది. గంభీరం, ఆనందపురం, వేములవలస, వెల్లంకి, లొడగలవానిపాలెం, పెద్దిపాలెం, మామిడివానిపాలెం,శొంఠ్యాం, గండిగుండం, గిడిజాల, దాకమర్రి, నరవ, గుర్రంపాలెం, సరిపల్లి, చీమలాపల్లి తదితర పంచాయతీల్లో రిజిస్ట్రేషన్ల ద్వారా భారీగా ఆదాయం లభిస్తోంది.

గంభీరం పంచాయతీకి ఏడాదికి రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.30 నుంచి రూ.40 లక్షల ఆదాయం రావలసి ఉందని సర్పంచ్ వానపల్లి లక్ష్మి తెలిపారు. రెండేళ్ల నుంచి ఈ ఆదాయం జమ కాకపోవడంతో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా రిజిస్ట్రేషన్ల ఆదాయం విడుదల చేయాలన్నారు. రిజిస్ట్రేషన్ల ఆదాయంపై జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా రెండేళ్లుగా పంచాయతీలకు రిజిస్ట్రేషన్ నిధులు విడుదల కాలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

అరకొర వేతనాలతో 102 ఉద్యోగుల వెతలు

... 5వ పేజీ తరువాయి

పంపేందుకు తెలుగుదేశం ప్రభుత్వం గతంలో తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్ పేరుతో వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ వాహనాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ వస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక సంస్థ ఉండగా, ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ హయాంలో 'అరబిందో' కాంట్రాక్టు దక్కించు కుంది. ప్రస్తుతం ఆ సంస్థ ఆధ్వర్యంలోనే వాహనాలు నడుస్తున్నాయి. నిర్వహణ సంస్థలకు ప్రభుత్వం ఎంత చెల్లిస్తుందోగానీ...ఉద్యోగులకు మాత్రం ఆశించిన స్థాయిలో వేతనాలు అందడం లేదు. దీంతో ఎంతోమంది ఉద్యోగాలు వదిలి వెళ్లిపోతున్నారు. అందుకే సేవలు సక్రమంగా అందడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటివరకూ ఆరుగురు పైలట్లు ఉద్యోగం మానేసినట్టు చెబుతున్నారు.

102 సిబ్బందిపై చిన్నచూపు

108, 104 వాహనాల మాదిరిగానే 102 వాహనాలు సేవలు అందిస్తున్నాయి. 108, 104 వాహనాల పైలట్లకు సుమారు రూ.15 వేలు నుంచి రూ.30 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. 102 వాహనాల పైలట్లకు మాత్రం ఏడెనిమిది వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. ఈ వాహనాల నిర్వహణ చూస్తున్న అరబిందో కాంట్రాక్టు ఈ నెలతో ముగియబోతోంది. కొత్త సంస్థకు వాహనాల నిర్వహణను అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొత్త ఏజెన్సీ అయినా కనీసం రూ.18 వేలు వేతనం చెల్లించేలా చూడాలని పైలట్లు కోరుతున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడుతోపాటు పలువురు మంత్రులను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు.

అధ్వానంగా నిర్వహణ

నిర్వహణ సరిగా లేకపోవడంతో తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు మార్గమధ్యంలో నిలిచిపోతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో 67 వాహనాలు ఉన్నాయి. అనకాపల్లి జిల్లాలో 22, విశాఖ జిల్లాలో 23, అల్లూరి జిల్లాలో 22 ఉన్నాయి. వీటిలో అనకాపల్లి జిల్లాలో మూడు, విశాఖ జిల్లాలో రెండు, అల్లూరి జిల్లాలో రెండు వాహనాలు నిర్వహణ లోపంతో నిలిచిపోయాయి. ఇంకొన్ని వాహనాలకు టైర్లు, బ్యాటరీ సమస్యలు ఉన్నాయి. అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి వాహనాల ఇబ్బందులను పరిష్కరించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

వైద్య శిబిరంలో క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పాల్గొన్న టీడీపీ నేతలు

కొమ్మాది, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పీఎంపాలెం కాలనీలోని సామాజిక భవనంలో ఒమేగా ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతో పాటు సాధారణ రోగులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అవసరమైన రోగులు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రేడియేషన్, అంకాలజీ నిపుణులుడాక్టర్ దివ్య, సౌజన్య, వంశీ, సిబ్బంది వైద్యశిబిరంలో పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో విశాఖపట్నం తెలుగుయవత ఉపాధ్యక్షుడు గరే గురునాథ్, గొల్లంగి ఆనందబాబు, లొడగల జానకిరామ్, పోలిశెట్టి నాగేశ్వరావు, రఘు పాల్గొన్నారు.

దంత ఆరోగ్యంపై అవగాహన

సాగర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో విదేశీ విద్యార్థులకు నోటి ఆరోగ్యం, దంత సంరక్షణపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. దంత సంరక్షణ పట్ల యువత అప్రమత్తంగా ఉండాలని, ఫాస్ట్ ఫుడ్, శీతల పానీయాలకు దూరంగా ఉండాలని పెరియోడాంటిక్స్ విభాగాధిపతి డాక్టర్ త్రినాథ్ కిశోర్ సూచించారు. చిగుళ్ల వ్యాధులకు గల కారణాలను వివరించారు. కార్యక్రమంలో దంత కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ నరసింహ రావు, తదితరులు పాల్గొన్నారు.

కత్తితో దాడి: ఒకరికి గాయాలు

భీమునిపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపులుప్పాడ రెడ్డీలపాలెంలో పాత కక్షల నేపథ్యంలో లారీ డ్రైవర్ ఎరుసు అప్పలరాజు, సెక్యూరిటీ గార్డు దేవాడ అప్పలసూరి మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. అప్పలసూరి కత్తితో దాడి చేయడంతో అప్పలరాజు ఎడమ చేతికి తీవ్ర గాయమైంది. దీంతో ఆయనకు భీమిలి ప్రభుత్వాస్పత్రితో ప్రథమ చికిత్స చేశాక మెరుగైన వైద్యం కోసం నగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అప్పలసూరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ సుధాకర్ తెలిపారు.

'చట్ట సభల్లో మత్స్యకారులకు అవకాశం కల్పించాలి'

భీమునిపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): చట్ట సభల్లో మత్స్యకారులకు అవకాశం కల్పించాలని కూటమి ప్రభుత్వానికి మత్స్యకార నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన టీడీపీ కార్యాలయంలో మాట్లాడుతూ మత్స్యకారులు ఎన్నో సమస్యలతో సతమతమవుతున్నారని, వాటిని చట్ట సభల్లో ప్రస్తావించడానికి అవకాశం ఇవ్వాలన్నారు. రాష్ట్రంలోని ఏ జిల్లాకు చెందిన మత్స్యకారులకైనా శాసన మండలిలో అవకాశం కల్పిస్తే కూటమి ప్రభుత్వంపై మరింత విశ్వాసం పెరుగుతుందని, దీనిపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ దృష్టి సారించాలని ఆయన కోరారు.

దివ్యాంగ పింఛన్‌దారులకు ధ్రువీకరణ పరీక్షలు

పద్మనాభం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దివ్యాంగ పింఛన్‌దారుల ధ్రువీకరణ పరీక్షలను భీమిలి పీహెచ్‌సీలో మంగళవారం చేపట్టారు. దివ్యాంగుల పెన్షన్‌దారుల్లో అసలైన లబ్ధిదారులను గుర్తించడానికి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. తొలిరోజు 145 మందిని పరీక్షించారు. మండలంలో 439 మంది దివ్యాంగ పింఛన్‌దారులు ఉన్నారని, మిగిలిన వారికి బుధ, గురువారాల్లో వైద్య పరీక్షలు చేస్తారని ఎంపీడీవో విజయ కుమార్ తెలిపారు.

ఎంతమంది ఆపదలో ఉన్నా రక్షించగల ధీశాలి హనుమ

ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



చాగంటిని పూలమాలతో సత్కరిస్తున్న అతిథులు

కొమ్మాది, మార్చి4 (ఆంధ్రజ్యోతి) : హనుమ ఒక్కరు ప్రాణాలతో ఉంటే ఎంతమంది ఆపదలో ఉన్నా ఆయన కాపాడతారని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు పేర్కొన్నారు. కొమ్మాదిలోని గాయత్రి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో నిర్వహిస్తున్న సంపూర్ణ రామాయణం ప్రవచనాలలో భాగంగా మంగళవారం యుద్ధకాండలోని రామలక్ష్మణులతో కూడిన వానరసైన్యం, ఇంద్రజిత్తుకు జరిగిన యుద్ధం గురించి వివరించారు. మేఘాల చాటు నుంచి విజృంభిస్తున్న ఇంద్రజిత్తును నిరోధించడానికి వానరసైన్యంలో వీరులు ప్రయత్నించినప్పటికీ అతడు చేస్తున్న మాయయుద్ధాన్ని ఆపలేకపోవటంతో ఇంద్రజిత్తు మేఘాల చాటు నుంచే ఎవరికీ కనపడకుండా బ్రహ్మాస్త్రం ప్రయోగించి వానరులను చంపడం, బ్రహ్మాస్త్రప్రయోగానికి రామలక్ష్మణులు కూడా మూర్ఛపోయి పడిపోవడం, అక్కడ పడి ఉన్న వానరులందరినీ వెతుక్కుంటూ వచ్చిన విభీషణుడు జాంబవంతుని చూడటం, జాంబవంతుడు హనుమ కుశలములను అడుగగా విభీషణుడు రామలక్షణుల గురించి కాకుండా హనుమ గురించి ఎందుకు అడుగుతున్నావని ఆరా తీయగా, హనుమ ఒక్కరు ప్రాణాలతో ఉంటే ఎంతమంది ఆపదలో ఉన్నా కాపాడగలరని జాంబవంతుడు తెలిపిన ఉదంతం గురించి వివరించారు. తరువాత రావణాసురుడి ఆజ్ఞ మేరకు అతడి సోదరులు పుత్రులతో కలిసి రాక్షస వీరులు ఎందరో యుద్ధానికి రాగా, వానరులంతా వారిని పరిమార్చారని వివరించారు. పరమ క్రూరాత్ముడైన ఇంద్రజిత్తు మరొక్కసారి యుద్ధానికి వచ్చి మాయాసీత రూపాన్ని తయారుచేసి హనుమ చూస్తుండగా ఆ మాయాసీతను వధించగా, హనుమ ఎంతగానో ఆవేదన చెంది రామలక్ష్మణులకు తెలపగా, వారు ఎంతో శోకించారని తెలిపారు. విభీషణుడు వచ్చి ఇంద్రజిత్తు మాయను తెలిపి ఇది ముమ్మాటికి సత్యం కాదని ఇంద్రజిత్తు ఎప్పటికీ సీత వంటి మహాపతివ్రతను వధించలేడని చెప్పిన ఘట్టాన్ని చాగంటి వివరించారు. ఎదుట కనపడకుండా యద్ధం చేస్తున్న శత్రువుపై అస్త్రాన్ని సంధించడం ధర్మం కాదని శ్రీరాముడు తెలుపగా, విభీషణుడు.. ఇంద్రజిత్తు చేసే నికుంబిలా హోమం గురించి తెలియచేసి ఆ హోమం చేసి అతడు యుద్ధానికి వస్తే ఓడించటం ఎవరితరం కాదని ఆ హోమం ఎట్టి పరిస్థితుల్లోను నిరోధించాలని విభీషణుడు చెప్పాడు. అప్పుడు లక్ష్మణుడు బయలుదేరిన ఘటనను వివరించారు. కార్యక్రమంలో అష్టలక్ష్మీ దేవాలయ ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ, గాయత్రి విద్యాపరిషత్ కార్యదర్శి ఆచార్య సోమరాజుపాల్గొన్నారు.

నిరుపయోగంగా ఏయూ ఫిజిక్స్ ల్యాబ్

» నగరపాలెంలో వృథాగా మారిన ఐదెకరాల స్థలం

» అటకెక్కిన వర్సిటీ తూర్పు క్యాంపస్ ప్రతిపాదనలు

» కార్యరూపం దాల్చని ఔషధాల మొక్కల నర్సరీ..

» నూతన వీసీ ప్రొఫెసర్ రాజశేఖర్ తగిన చర్యలు చేపట్టాలని పలువురు విద్యావేత్తల విజ్ఞప్తి





నగరపాలెంలో శిథిలావస్థకు చేరుకున్న ఏయూ ఫిజిక్స్ లేబొరేటరీ భవనాలు

మధురవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాకెట్ లాంచింగ్‌లకు, విద్యార్థులకు విలువైన సమాచారాన్ని అందించిన మధురవాడ నగరంపాలెంలోని ఆంధ్రా యూనివర్సిటీ ఫిజిక్స్ లేబొరేటరీ కనుమరుగవుతోంది. నగరంపాలెంలో సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో 50 ఏళ్ల కిందట ఫిజిక్స్ లేబొరేటరీని ఏయూకి అనుబంధంగా ఏర్పాటు చేశారు. దేశంలో ఎక్కడ నుంచి అంతరిక్షంలోకి రాకెట్లు పంపించినా ఇక్కడి ల్యాబ్ నుంచి అందించే సమాచార విశ్లేషణపైనే ఆధారపడి ఉండేది. అందుకు అనుగుణంగా ల్యాబ్‌లో కంప్యూటర్లతో పాటు సుమారు వందడుగుల ఎత్తున యాంటెనా ఉండేది. అయితే హుద్‌హుద్ తుపాన్ సమయంలో యాంటెనా నేలకొరిగింది. కంప్యూటర్లు కూడా పాడైపోవడంతో డేటా ఎనాలసిస్‌కు అవాంతరాలు ఎదురయ్యాయి. అప్పటినుంచి ఈ ల్యాబ్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. సుమారు 20 ఏళ్ల కిందట ఇదే ప్రాంతంలో ఏయూ తూర్పు క్యాంపస్‌గా అభివృద్ధి చేయడానికి వర్సిటీ సెనెట్ కూడా ప్రతిపాదించింది. విజయనగరం, శ్రీకాకుళం, ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన పీజీ విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని అప్పట్లో భావించారు. కానీ కాలక్రమంలో ఈ ప్రతిపాదన అమలుకు నోచుకోలేదు. ఆ తరువాత ఇక్కడ ఆయుర్వేద ఔషధ మొక్కలతో నర్సరీని ఏర్పాటు చేయాలనుకున్నారు. అయితే అదికూడా కార్యరూపం దాల్చలేదు. దీంతో ఫిజిక్స్ ల్యాబ్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. కోట్ల రూపాయల విలువ చేసే స్థలం నిరుపయోగంగా మారింది. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ నగరంపాలెం స్థలంపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు విద్యావేత్తలు విజ్ఞప్తి చేస్తున్నారు.

దివ్యాంగుల కోసం పారా స్టేడియం ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలనలో పాల్గొన్న అధికారులు

కొమ్మాది, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దివ్యాంగుల కోసం పారా స్టేడియం నిర్మించడానికి గాను బక్కన్నపాలెం విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంస్థలోని అనువైన ప్రదేశాన్ని గుర్తించడానికి పలువురు అధికారులు మంగళవారం ఇక్కడకు వచ్చారు. భారత ప్రభుత్వ న్యాయ, సాధికారత సంక్షేమశాఖ డైరెక్టర్ వినీత్ సింఘాల్, ఎఎస్‌వో రాహుల్‌కుమార్ విభిన్న ప్రతిభావంతుల విభాగ డైరెక్టర్ రవిప్రకాశ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, చినగదిలి తహశీల్దార్ పాల్ కిరణ్‌లు క్షేత్ర స్థాయిలో స్థలాన్ని పరిశీలించారు అనంతరం ఎండాడలోని ప్రభుత్వ అంధ బాలికల పాఠశాలను సందర్శించారు.

కయాకింగ్ అండ్ కనోయింగ్ పోటీలకు గాయత్రి ఎంపిక



సాగర్‌నగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): థాయిలాండ్‌లో ఈ నెల 7 నుంచి 12వ తేదీ వరకు జరగనున్న కయాకింగ్ అండ్ కనోయింగ్ పోటీలకు ఏపీ నుంచి నగిడి గాయత్రి ఎంపికైనట్టు ఆంధ్రప్రదేశ్ కనోయింగ్ కయాకింగ్ అసోషియేషన్ (సీకేఏఏపీ) ప్రెసిడెంట్ బలరాంనాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మన రాష్ట్రం నుంచి భారత్‌కు ప్రాతినిధ్యం గాయత్రిని ఆయన అభినందించారు.

దివీస్‌లో భద్రతా మాసోత్సవాలు

భీమునిపట్నం (రూరల్), మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిప్పాడ దివీస్ కర్మాగారంలో మంగళవారం నుంచి భద్రతా మాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. వీటిని ప్రారంభించిన భీమిలి ఆర్డీవో కె.సంగీత్ మాధుర్ మాట్లాడుతూ ప్రదేశంలో కార్మికులంతా భద్రతా నియమాలను పాటించాలని,నిత్యం అప్రమత్తంగా ఉండాలని కోరారు. దివీస్ సేఫ్టీ అధికారి ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ భద్రత కోసం ఆధునిక యంత్రాలను సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో దివీస్ డైరెక్టర్ దేవేందరరావు, జన రల్ మేనేజరు కోటేశ్వరరావు కె. సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రహదారులపై పశువుల సంచారం

» ప్రజలకు తప్పని తిప్పలు



నగరంపాలెం రోడ్డులో ఉన్న పశువులు

మధురవాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మధురవాడ పరిసరాల్లోని పలు కాలనీల్లో పశువుల సంచారం అధికం కావడంతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నగరంపాలెం, మధురవాడ, మిథిలాపురి వుడా కాలనీ, మల్లయ్యపాలెం, పాత మధురవాడ మెట్ట, అయోధ్య నగర్, తదితర ప్రాంతాల్లోని వీధుల్లో విచ్చలవిడిగా పశువులు తిరుగుతున్నాయి. రహదారులకు అడ్డంగా గుంపుగా ఆవులు, గేదెలు ఉంటుండడతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు నానాపాట్లు పడుతున్నారు. జీవీఎంసీ అధికారులు జాతీయ రహదారిపై సంచరిస్తున్న పశువులను మాత్రమే అప్పుడప్పుడు వ్యాన్లలో వాటిని తరలిస్తూ- సంబంధిత యజమానులకు అపరాధ రుసుం వసూలు చేసి వాటిని విడిచిపెడుతున్నారు. కానీ కాలనీలోని రోడ్లపై తిరుగుతున్న పశువులను చూసీచూడనట్టు ఉంటుండడంతో పశువుల పెంపకందారులు ఇష్టానుసారంగా తమ గేదెలు, ఆవులను విడిచిపెడుతున్నారు. కొన్నిసార్లు వాహనాలకు అడ్డంగా అవి రావడంతో కింద పడి వాహన చోదకులు గాయపడుతున్నారు. అందువల్ల కాలనీల్లోని రోడ్లపై పశువులను విడిచిపెడుతున్న యజమానులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

కాంట్రాక్టు కార్మికుల సమ్మె వాయిదా

» 11న ఆర్‌ఎల్‌సీ సమక్షంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాల చర్చల నేపథ్యంలో..

» చర్చలు అనుకూలంగా లేకుంటే సమ్మె చేపడతామంటున్న నాయకులు


ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు (ఫైల్ ఫొటో)

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులోని కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీన తలపెట్టిన నిరవధిక సమ్మెను ప్రస్తుతా నికి వాయిదా వేసిననట్టు కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఈ నెల 11న రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్‌ఎల్‌సీ) సమక్షంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరగనున్న నేపథ్యంలో ఏడున తలపెట్టిన సమ్మెను వాయిదా వేశామన్నారు. ఆ చర్చల్లో కార్మికులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోతే నిరవధిక సమ్మె చేస్తామని వారు స్పష్టం చేశారు. ఆర్‌ఎల్‌సీ సమక్షంలో ప్లాంట్ యాజమాన్యంతో జరిగే చర్చల్లో తమకు అనుకూలంగా నిర్ణయాలు జరిగేలా కార్మిక సంఘాల నాయకులు చూడాలని పలువురు కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు. ప్రస్తుతం స్టీల్‌ప్లాంటులో సుమారు తొమ్మిది వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కార్మిక సమస్యలను పరిష్కరిస్తేనే తాము సమ్మె ప్రతిపాదనను విరమించుకుంటామని కార్మిక సంఘ నాయకులు పేర్కొంటున్నారు.

ఇవీ కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలు..

» ప్లాంటులో ఏ ఒక్క కాంట్రాక్టు కార్మికుడిని విధుల నుంచి తొలగించరాదు.
» టెండర్ల ప్రక్రియ ముగిసిన కాంట్రాక్టర్ల పనిచేసే కార్మికులకు మరోచోట ఉపాధి కల్పించాలి.
» 60 ఏళ్లు నిండిన కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించాలి.
» పాత పద్ధతిలోనే గేటు పాసులు మంజూరు చేయాలి.
» కనీస వేతనాలు చెల్లించాలి.
» ప్రమాద ఎక్స్‌గ్రేషియాను రూ.30 లక్షలు చెల్లించాలి.
» ఎనిమిది గంటల పని దినాలను అమలు చేయాలి.
» ఈఎస్‌ఐ ద్వారా మెరుగైన వైద్య సేవలందించాలి.
» ప్రమాదం జరిగిన చోట నుంచి ఈఎస్‌ఐ రిఫర్ చేసిన ఆస్పత్రి వరకు అంబులెన్స్ సౌకర్యం కల్పించాలి.
» కార్మికుల నైపుణ్యతను బట్టి డిజిగ్నేషన్‌లలో మార్పులు చేయాలి.
» పెండింగ్‌లో ఉన్న ఫుల్ అండ్ ఫైనల్‌ను యాజమాన్యం చెల్లించాలి.
» ఖాళీ అయిన పోస్టులను నిర్వాసితులతో భర్తీ చేయాలి.

ఉక్కు యాజమాన్యం స్పందించాలి

-మంత్రి రవి, ఏఐటీయూసీ ప్లాంట్ కాంట్రాక్టు సంఘ ప్రధాన కార్యదర్శి



కాంట్రాక్టు కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యలను పరిష్కరించాలని గతంలో అధికారులకు విన్నవించాం. ఉక్కు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు యాజమాన్యం ముందుకు రావాలి. ఈ నెల 11న జరగనున్న చర్చల్లో కార్మికులకు అనుకూలంగా నిర్ణయాలు తసుకోవాలి, లేకుంటే నిరవధిక సమ్మెకు దిగుతాం.

భూ పరిహారం కోసం రైతుల ఆందోళన బాట

» తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

» ఆనంద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేత


తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

పెందుర్తి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రైతుల ఆధీనంలో ఉన్న వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకునేందుకు రైల్వే శాఖ అధికారులు సర్వే చేపట్టడంపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళన బాట పట్టారు. పరిహారం చూపకుండా తమ భూములను బలవంతంగా లాక్కునేందుకు యత్నిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం నిరసన తెలిపారు. ప్రత్యేక రైల్వే ప్రాజెక్ట్‌లో భాగంగా పెందుర్తి-సింహాచలం నార్త్ స్టేషన్ల మధ్య రైల్వే ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణం నిమిత్తం భూ సేకరణ కోసం రైల్వే మంత్రిత్వశాఖ ఆదేశాలతో ఈస్ట్‌కోస్టు రైల్వే అధికారులు గజెట్ నోటిఫికేషన్‌ను ఇటీవల జారీ చేశారు. రైల్వే ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణ ప్రక్రియతో మండలంలోని పొర్లుపాలెం, చీమలాపల్లి, చింతల అగ్రహారం, లక్ష్మీపురం గ్రామాల్లోని సాగు భూములను రైతులు కోల్పోనున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఆయా గ్రామాలకు చెందిన భూములు కోల్పోనున్న కర్షకులు, మహిళా రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి పెందుర్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి రైల్వే అధికారుల తీరుపై నిరసన తెలిపారు. భూ సేకరణ సమాచారం లేకుండా.. కనీసం నోటీసులు ఇవ్వకుండా సాగులో ఉన్న భూములపై ఎలా సర్వే చేస్తారంటూ నినదించారు. తమ ఆధీనంలో ఉన్న భూములను సింహాచల దేవస్థానానికి చెందినవని అధికారులు చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే భూ సేకరణలో రైతులకు పరిహారం ఇవ్వడం కుదరదంటున్నారని వాపోయారు. గతంలో దేవస్థాన భూములను ప్రజా ప్రయోజనాల కోసం వినియోగిస్తే అందులో గల రైతులను గుర్తించి దేవస్థానానికి, రైతులకు సమానంగా పరిహారమిచ్చారని గుర్తు చేశారు. అదేవిధంగా రైల్వే ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణంలో భూములు కోల్పోనున్న భూములకు చెందిన రైతులను అనుభవ హక్కుగా గుర్తించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అంతేకాక తమ సమస్య పరిష్కారం కాకపోతే నిరాహార దీక్షలకు దిగుతామని హెచ్చరించారు. అనంతరం తహశీల్దార్ ఆనంద్‌కుమార్‌కు రైతులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతులు గల్లా వెంకటరమణ, పులమరశెట్టి వెంకటరమణ, ప్రేమ్‌కుమార్, రాపర్తి నాగార్జున, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన నిర్మాణ పనులు

» మరో ఐదు నెలల్లో అందుబాటులోకి వచ్చే అవకాశం



మల్కాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): డాక్‌యార్డు సమీపంలో చేపట్టిన సర్దార్ వల్లభాయ్ పటేల్ వంతెన నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. ఈ పనులు సంపూర్ణంగా పూర్తయ్యేందుకు ఇంకా ఐదు నెలల సమయం పట్టనున్నట్టు తెలుస్తుంది. ఈ వంతెనను పది స్పెన్‌లతో నిర్మించాల్సి ఉండగా మూడు స్పెన్‌లు పూర్తయ్యాయి. ఇంకా ఏడు స్పెన్‌లను నిర్మించాల్సి ఉంది. ఈ పనులు ఆగస్టు నాటికి పూర్తి కావచ్చని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. వంతెన నిర్మాణ పనులు పూర్తయిన వెంటనే ప్రయాణికుల రాకపోకలకు అవకాశం కల్పిస్తామని వారు చెబుతున్నారు. ప్రస్తుతం పారిశ్రామిక ప్రాంత ప్రజలు డాక్‌యార్డు ఎదురుగా ఉన్న రోడ్డు మీదుగా నగరంలోకి వచ్చేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాగా ఈ వంతెన పనులు ఇప్పటికే పూర్తి కావాల్సి ఉండగా వివిధ కారణాల వల్ల ఆలస్యం చోటుచేసుకుంది. వంతెన నిర్మాణ పనులపై ఎమ్మెల్యేతో పాటు జిల్లా అధికారులు దృష్టిసారించి త్వరితంగా అందుబాటులోకి వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా ముగిసిన పోలమాంబ జాతర


పూజలందుకున్న పోలమాంబ

అగనంపూడి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 85వ వార్డు పరిధి ఫార్మాసిటీ పునరావాస కాలనీ ఈ-బోనంగి గ్రామస్థుల ఆరాధ్య దేవత పోలమాంబ జాతర మంగళవారంతో వైభవంగా ముగిసింది. అనుపోత్సవాన్ని పురస్కరించుకుని ఉదయం 6 గంటల నుంచే అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయం వద్ద బారులుతీరారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను పురవీధుల్లో ఊరేగించాక ఆలయం వద్దకు తీసుకువచ్చి పూజలు జరిపారు. ఈ సందర్భంగా చేపట్టిన బాణసంచా కాల్పులు, రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అట్టా సన్యాసి అప్పారావు, మంత్రి గిరిప్రసాద్, ఎం.శివాజీ, బి.సతీశ్ శ్రీనివాసరావు, ఎం.ఫైడిరాజు, గోవింద, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ఠాపనకు శ్రీకారం


ఆలయం వద్ద హోమం చేస్తున్న వేదపండితులు

అక్కిరెడ్డిపాలెం, మార్చి 4, (ఆంధ్రజ్యోతి): ఇక్కడి హైస్కూల్ మైదానంలో పునర్నిర్మించిన కుంచుమాంబ, దుర్గమాంబ ఆలయంలో అమ్మవార్ల విగ్రహాల ప్రాతిష్ఠాపన కార్యక్రమానికి మంగళవారం శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా మేళతాళాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహాలను కాలనీలో ఊరేగించారు. ఆలయం వద్ద ఏర్పాటు చేసిన యాగశాలలో వేదపండితులు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు భక్తులు కీరాభిషేకం చేసి పూజలు చేశారు. ఆరో తేదీన ఆలయంలో అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

వైభవంగా జరుగుతున్న శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు


కుంకుమ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేపగుంట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై ఉన్న కల్యాణ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రాత్రి శోభాయమానంగా అలంకరించిన స్వామివారి ఉత్సవ విగ్రహం ముందు మహాలక్ష్మీకి సామూహిక కుంకుమార్చన పూజలు జరిపారు. అనంతరం యాగశాలార్చన, వేద శ్రోత్ర పారాయణం నిర్వహించారు. ఉదయం ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామికి తమలపాకులు, సింధూరంతో సహస్రనామార్చన, హనుమత్ హోమం, ఐశర్య ప్రాప్తికోసం శ్రీయాగం, శ్రీ మహాలక్ష్మీ అవాహనం, తదితర పూజాది కార్యక్రమాలను చేపట్టారు.

బాలలపై లైంగిక దాడులు జరగకుండా చూడాలి

జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది


కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి ఆనంది

గోపాలపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): బాలలపై లైంగిక దాడులు జరగకుండా పాఠశాల స్థాయి నుంచే ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలని జిల్లా న్యాయమూర్తి జి.ఆనంది అన్నారు. బాలల లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం (పోక్సో)పై మంగళవారం స్థానిక బాలాజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ బాలలు లైంగిక నేరాల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలల హక్కులు, చట్టపరమైన రక్షణ అంశాలపై విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బీవీఆర్ మూర్తి, గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు, సీడబ్ల్యూసీ మెంబర్ ఎం.రమణకుమారి, సీడీపీవో కేవీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

88వ వార్డులో కార్డన్ అండ్ సెర్చ్

కూర్మన్నపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా సీపీ ఆదేశాల మేరకు మంగళవారం దువ్వాడ సీఐ మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో 88వ వార్డు మంగళపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, మదీనాబాగ్‌లలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని ఆరు వాహనాలను సీజ్ చేశారు. పలువురు అనుమానితులను పిలిచి మద్యం నిల్వలపై ప్రశ్నించారు. రౌడీషీటర్ సీలాపు శివకుమార్‌తో పాటు పలువురు రౌడీ షీటర్లను పిలిచి వారి కదలికలపై ఆరా తీశారు. రౌడీ షీటర్లు ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

అగనంపూడి హైస్కూల్‌కు కంప్యూటర్ వితరణ

అగనంపూడి, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జేడీ ఫౌండేషన్ సహకారంతో హెచ్‌పీసీఎల్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కంప్యూటర్‌ను వితరణగా అందజేశారు. మంగళవారం సంస్థ ప్రతినిధులు హెచ్ఎం ఎం.కృష్ణారావుకు కంప్యూటర్‌ను అందించారు. విద్యాభివృద్ధికి హెచ్‌పీసీఎల్ సంస్థ చేస్తున్న సేవలను హెచ్ఎం కొనియాడారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు అన్నపూర్ణ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పరిశీలించిన డిప్యూటీ మేయర్

ఎన్.ఎ.డి.జంక్షన్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి):జీవీఎంసీ 52వ వార్డు పరిదిలోని కరాస, మర్రిపాలెం ఉడాకాలనీ, పోలీస్‌క్వార్టర్స్‌కు వెళ్లె ప్రాంతం, హైవే అనుకొని ఉన్న గ్రీన్ బెల్ట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులును డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ మంగళవారం పరిశీలించారు. కరాస శ్మశానవాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులును ఇంజనీరింగ్ సిబ్బందితో అయా పనులను స్థితి గతులను అడగి తెలుసుకున్నారు. కరాస క్వార్టర్స్‌కు వెళ్లె మార్గంలోని కాలువ పనులు జరుగుతున్న తీరు. అదేవిధంగా వాకింగ్ ట్రాక్ అక్కడి వసతులు ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్ మూర్తి, సచివాలయం ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


డంపింగ్ యార్డు వద్ద ధర్నా చేస్తున్న తిరుమలనగర్ కాలనీ వాసులు, టీడీపీ నాయకులు

డంపింగ్ యార్డును తరలించాలని ధర్నా

వారం రోజుల్లోగా చర్యలు చేపట్టకపోతే ఐలా కార్యాలయం వద్ద ఆందోళన చేస్తాం: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్

కూర్మన్నపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 87వ వార్డు పరిధి తిరుమలనగర్ సమీపంలో ఆటోనగర్ ఈ-బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన అనధికార డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తూ తిరుమలనగర్ కాలనీ వాసులు ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ మాట్లాడుతూ ఇటీవలే ఈ సమస్యను కాలనీవాసులు 'ఆంధ్రజ్యోతి అక్షరం అండగా.. పరిష్కారమే అజెండా'గా కార్యక్రమంలో అధికారుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. తరచూ గుర్తు తెలియని వ్యక్తులు డంపింగ్ యార్డులోని వ్యర్థాలకు నిప్పంటిస్తుండడంతో పొగబారిన బాడి కాలనీవాసులు దీర్ఘకాల రోగాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్య నియంత్రణ అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో తిరుమలనగర్, తారకరామనగర్, ఎన్టీఆర్ కాలనీ, పాత వడ్లపూడి, కణితి కాళింగుల వీధి, తదితర ప్రాంతలు కాలుష్య సాకారంగా మారుతున్నాయన్నారు. ఈ విషయంపై ఇప్పటికే కాలనీ వాసులు జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్, జడ్సీ ఐలా కమిషనర్, ఎన్విరాన్‌మెంట్ చీఫ్ ఇంజనీర్లను వినతి పత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. వారం రోజుల్లోగా డంపింగ్ యార్డును తరలించకపోతే ఆటోనగర్‌లోని ఐలా కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని బొండా జగన్ హెచ్చరించారు. అలాగే రోడ్డు నంబర్-7లోకి కలుషిత నీరు రాకుండా చర్యటు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్ రాజు, డీవీ అప్పారావు, ఎం.రాము,పి.దానయ్య,బాబూరావు, పెంటారావు, భాగ్యలక్ష్మి, తిరుమలనగర్ కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కె.నాగభూషణం, జి.విశ్వేశ్వరరావు, ఎం.పరమానందం, పరమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంలో చేరండి

ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ శ్యాంబాబు


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శ్యాంబాబు

ఆటోనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు అందరూ విధిగా ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకంలో చేరి సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ శ్యాంబాబు కోరారు. 70వ వార్డు పరిధి ఆటోనగర్ వద్ద మంగళవారం నిర్వహించిన వినియోగదారుల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పేద,మధ్యతరగతి ప్రజలకు విద్యుత్ బిల్లులను తగ్గించడమే లక్ష్యంగా కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఒక కిలోవాట్ వ్యవస్థకు రూ.30 వేలు, 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్ల వ్యవస్థకు రూ.78 వేల రాయితీ లభిస్తుందన్నారు. జోన్-2 ఈఈ టీకె నాయుడు, డీఈ ఎ.పార్థసారథిలు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ద్వారా వినియోగదారులకు లబ్ధి చేకూరుస్తున్నందున అందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

'హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి'


నూతనంగా ఎన్నికైన ఆలయ కమిటీ సభ్యులతో కరణంరెడ్డి నరసింగరావు

గాజువాక, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు కోరారు. బీసీ రోడ్డులోని అభయాంజనేయస్వామి, సంతోషిమాత ఆలయాల ప్రాంగణంలో సోమవారం రాత్రి నిర్వహించిన హిందూ ధర్మ పరివార్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ దేవాలయాల పరిరక్షణ, ఆలయాల అభివృద్ధి, సనాతన హిందూ ధర్మం పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తామెంతో కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఆలయ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.సతీశ్, కార్యదర్శిగా ఎస్.అప్పన్నకుమార్, ఉపాధ్యక్షుడిగా పి.నాగేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా పి.రామచంద్రరావు, కోశాధికారిగా ఎల్.దుర్గాప్రసాద్‌లను ఎన్నుకున్నారు.

విషాదంలోనూ దాతృత్వం

మృతి చెందిన కుమారుడి నేత్రాలను దానం చేసిన తల్లిదండ్రులు


వైద్యురాలికి అంగీకార పత్రాన్ని అందజేస్తున్న కుటుంబ సభ్యులు

గోపాలపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కుమారుడు మృతి చెందిన దుఃఖంలో ఉన్నప్పటికీ పరులకు సహాయం చేయాలనే తపనతో అంత విషాదంలోనూ ఆ తల్లిదండ్రులు దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇక్కడి లక్ష్మీనగర్‌కు చెందిన గోకా శివకృష్ణ మనస్తాపంతో సోమవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తీవ్ర విషాదంలో ఆ తల్లిదండ్రులు ఉన్నప్పటికీ తమ కుమారుడి కళ్లను దానం చేయడానికి ముందుకువచ్చారు. దీంతో మోహసిన్ ఐ బ్యాంక్ వైద్యులు మృతుడు శివకృష్ణ నేత్రాలను సేకరించారు. మృతుని తల్లిదండ్రులు దమయంతి, సోమేశ్‌ల సేవాగుణాన్ని స్థానికులు కొనియాడారు.

ఉక్కు అధిక ఉత్పత్తితో కేంద్రం కళ్లు తెరిపిద్దాం

ఇంటక్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంవత్సర ఆఖరి నెలలో అధిక ఉత్పత్తి సాధించి కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిద్దామని ఇంటక్ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధిక ఉత్పత్తే లక్ష్యంగా కార్మికులు ముందుకు సాగాలన్నారు. కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నా యాజమాన్యం, గుర్తింపు యూనియన్ ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. కార్మికులకు ఆర్థిక ప్రయోజనాల కల్పనకు ఇంటక్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు పీవీ రమణ మూర్తి, బీఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కార్మిక నాయకుడికి సత్కారం

పెదగంట్యాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ స్టీల్‌ప్లాంట్ కార్యనిర్వాహక అధ్యక్షుడు అనిపెద్ది మసేన్‌రావును యూనియన్ నాయకులు మంగళవారం ఘనంగా సత్కరించారు. నడుపూరులోని కమ్యూనిటీ హాల్‌లో జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్మిక నాయకుడిగా మంచి సేవలందించిన వారిని కార్మికులు ఎప్పటికీ మరచిపోరన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, కార్మిక నాయకులు డి.ఆదినారాయణ, దొమ్మేటి అప్పారావు, వంశీకృష్ణ, నమ్మి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యా బోధన

మండల విద్యాశాఖాధికారులు ఈ.శ్రీనివాసరావు, కె.రమణాజీ


ఈ శ్రీనివాసరావు ఎంఈవో-1


కె.రమణాజీ, ఎంఈవో-2

పెదగంట్యాడ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో 32 ప్రాథమిక పాఠశాలలు, ఒక ప్రాథమికోన్నత పాఠశాల, మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఓ జూనియర్ కళాశాలలో శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యా బోధన జరుగుతుందని ఎంఈవో-1 ఈ.శ్రీనివాసరావు, ఎంఈవో-2 కె.రమణాజీ అన్నారు. అన్ని తరగతులకు సంబంధించి 5,449 మంది విద్యార్థులున్నారని, వారికి బోధించేందుకు 83 మంది రెగ్యులర్ ఉపాధ్యాయులు, 92 మంది టైమ్ స్కేల్ టీచర్లు ఉన్నారని వారు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

ప్రశ్న: మండలంలో విద్యా విధానం ఏ విధంగా కొనసాగుతుంది?

జవాబు: శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అన్ని పాఠశాలలు, కాలేజీలో విద్యా బోధన జరుగుతుంది, ఇందుకు సంబంధించి ప్రతి నెలా ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహిస్తున్నాం. పదో తరగతికి కూడా శత శాతం లక్ష్యంగా పనిచేస్తున్నాం. 85 శాతానికి తగ్గకుండా ఉత్తీర్ణ సాధిస్తాం.

ప్ర: పాఠశాలల్లో డ్రాపవుట్ పిల్లలు ఎంత మంది ఉన్నారు, వారిని మళ్లీ స్కూళ్లలో చేర్పించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: మండలంలో ఇటీవల నిర్వహించిన సర్వేలో 303 మంది డ్రాపవుట్స్ ఉన్నట్టు గుర్తించాం. ఇందులో ఎక్కువ మంది బిహార్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వలస వచ్చి ఇక్కడి పాఠశాలల్లో చేరిన వారే. వారంతా తిరిగి తమ రాష్ట్రాలకు వెళ్లిపోవడంతో డ్రాపవుట్‌లోకి వచ్చారు. ఇలాంటి వారు 50 శాతం మంది విద్యార్థులున్నారు. మిగిలిన వారిని ఈ విద్యా సంవత్సరంలో స్కూళ్లలో చేర్పిస్తాం. ఇందుకు ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బందిని వినియోగించుకుంటాం.

ప్ర: ఏకోపాధ్యాయ పాఠశాలల్లో టీచర్లు సెలవు పెడితే పరిస్థితి ఏమిటి?

జ: మండలంలో ఐదు ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమైతే ఆ స్కూల్‌కు సమీపంలో ఉన్న పాఠశాలలోని టైమ్ స్కేల్ ఉపాధ్యాయులను పంపిస్తాం. అంతేగాని పాఠశాలకు సెలవు ప్రకటించడం జరగదు.

ప్ర: పాఠశాలల అభివృద్ధికి కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జ: మండలంలోని అన్ని పాఠశాలలకు సరిపోయే ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంది. ఒక్క నడుపూరు ప్రాథమిక పాఠశాలకే కొరత ఉంది. గంగవరం, కొత్తదిబ్బపాలెం, పల్లిపాలెం, జాలరిపల్లి పాలెం పాఠశాలలకు అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం అవసరమైన అన్ని వసతులను సమకూర్చింది.

సినిమా గైడ్

● **శబ్దం** : సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
● **మజాకా** : శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
● **డ్రాగన్** : జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
● **తండేల్** : శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ (గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
● **సంక్రాంతికి వస్తున్నాం** : మెలోడి, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
● **డాకు మహారాజ్** : శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
● **గేమ్ ఛేంజర్** : మెలోడి, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 44, పచ్చిమిర్చి 30, కాకరకాయలు 40, బీరకాయలు 54, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజీ 12, క్యారెట్ 28 దొండకాయలు 36, బంగాళదుంపలు 15, అరటికాయ (పె) 6, మునక్కాడలు (కిలో) 66, అల్లం (పాతది) 52, బరబాటి 36, నిమ్మకాయలు (కిలో) 85, బద్ద చిక్కుడు 34, దోసకాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 32, కీరదోస 28, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 38, చిలగడదుంపలు 40, కంద 64, దేముడుచిక్కుడు 50, గోరుచిక్కుడు 36, కూరపెండలం 26, బ్రకోలి 45, నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 85, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 3, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 120, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 22, మామిడి అల్లం 64, బొప్పాయి 42, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

వైసీపీ మద్యం పాలసీపై విచారణ జరిపించాలి

» అసెంబ్లీలో దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ

డాబాగార్డెన్స్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన మద్యం పాలసీపై పూర్తిస్థాయి విచారణ జరిపించి, దోషులను శిక్షించాలని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే సీహెచ్ వంశీకృష్ణ శ్రీనివాస్ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందన్నారు. ఎక్సైజ్ శాఖను పూర్తిగా అవినీతిమయం చేసిందన్నారు. జే బ్రాండ్స్ ద్వారా ప్రజల ఆరోగ్యంతో ఆడుకుందన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఎక్సైజ్ శాఖ సమర్థంగా పనిచేస్తోందన్నారు. మద్యం తయారీదారుల నుంచి బిల్లు లేకుండా కొన్ని వందల లారీల సరకును దుకాణాలకు సరఫరా చేశారన్నారు. కేవలం రూ.18 ఉన్న రవాణా ఖర్చును 36 రూపాయలకు పెంచారన్నారు. వైసీపీ హయాంలో జరిగిన మద్యం దోపిడీపై తక్షణం విచారణ కమిటీ వేయాలన్నారు.

కోటి ఆశలతో కొత్త జీవితం ప్రారంభించండి

డాబాగార్డెన్స్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : జీవితంలో అనుకోని సంఘటనల ద్వారా భర్త లేదా భార్యను కోల్పోయి జీవితం అంధకార బంధురం అయినవారికి వితంతు వివాహాలు కొత్త జీవితాన్ని అందిస్తాయని సీఏ ఏవీ రమణ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆడారి వెంకటరమణ తెలిపారు. డాబాగార్డెన్స్ ప్రేమ సమాజంలో మంగళవారం ఉచితంగా పునర్వివాహం, వితంతు వివాహాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం ఇద్దరు వితంతువులను పరిచయం చేయడం ద్వారా వారు జీవితంలో స్థిరపడేందుకు అవకాశం కలుగుతుందన్నారు.ఈ విషయమై తాము కొన్నేళ్లుగా ఉచితంగా కార్యక్రమాలను చేపడతున్నామన్నారు. కొందరు వితంతువులు సమాజానికి దూరంగా ఉండేందుకు చూస్తుంటారని అలాకాకుండా వారు మంచి జీవితాన్ని గడిపేందుకు ఈ వేదిక ఉపయోగకరమన్నారు. కార్యక్రమంలో పలువురు వితంతువులు, ఫౌండేషన్ సభ్యులు జి.త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ టోర్నీకి జిల్లా క్రీడాకారులు

విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ అండర్-10, 13, 15 బాలబాలికల విలువిద్య చాంపియన్‌షిప్ టోర్నీలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి చిన్నారులు పాల్గొననున్నారు. ఈనెల 20 నుంచి గుంటూరులో జరగనున్న ఇండియన్ రౌండ్ ఈవెంట్ అండర్-15 బాలుర విభాగంలో ఎస్.రామచైతన్య, బి.మనిత్, పి.రాథోడ్, బాలికల విభాగంలో సాయి మనస్విని కనకల, బి.శ్రీవైష్ణవి, అండర్-13 బాలుర విభాగంలో వి.లలిత్ సాయితేజ, ఎస్.తేజేశ్వరరావు, ఆశ్రిత్ సాయి, బాలికల విభాగంలో ఆద్య వేమూరి, కె.చైద్య నందిత, అండర్-10 బాలుర విభాగంలో ఎస్‌వి.శరత్ వర్మ, పి.ఠాగూర్ అక్షిత్, బి.వెంకటవిరాజ్ పాల్గొంటారు. ఇక కాంపౌండ్ అండర్-13 బాలికల విభాగంలో వి.యశస్వి, ఆద్య వేమూరి, రికర్వ్ ఈవెంట్ బాలికల అండర్-13లో ఎస్.తన్మయశ్రీ, అండర్-10లో ఎస్.కన్విక్‌శ్రీ, అండర్-10 బాలుర విభాగంలో ఎల్.సాత్విక్ సుదేవి, ఎన్.శశికాంత్ ఆడనున్నారు. చిన్నారులను జిల్లా ఆర్చరీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.సూర్యనారాయణరెడ్డి, కె.నిశాంత్, పి.సత్యనారాయణ తదితరులు అభినందించారు.

పోక్సో కోర్టు పీపీగా రాజశేఖర్



మహారాణిపేట, మార్చి4 (ఆంధ్రజ్యోతి): విశాఖ పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బత్తి రాజశేఖర్ నియమితులయ్యారు. ప్రస్తుతం టీడీపీ జిల్లా న్యాయ విభాగం అధ్యక్షునిగా పనిచేస్తున్న ఆయనను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎంపీ శ్రీభరత్, పార్టీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జీలకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

సీతంపేట, మార్చి 4, (ఆంధ్రజ్యోతి): పెట్రోలు బంకులో పనిచేస్తున్న వ్యక్తి అదృశ్యమయ్యాడని పోలీసులకు ఫిర్యాదు అందింది. కంచరపాలెం పెద్ద కొత్తూరుకు చెందిన పెద్దాడ రామకృష్ణ (39) అక్కయ్యపాలెం ఫోర్త్ టౌన్ పోలీసుస్టేషన్ వెనుకనున్న పెట్రోలు బంక్‌లో పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి విధుల్లో ఉండగా ఫోను రావడంతో గురుద్వార కూడలికి వెళ్తున్నానని తన స్నేహితుడికి ఫోన్ చేసి చెప్పాడు. తన వద్ద పెట్రోల్ బంకు డబ్బులు కూడా ఉన్నాయని చెప్పాడు. అలా వెళ్లిన రామకృష్ణ తిరిగి రాలేదని ఫోన్ కూడా స్విచాఫ్ అని వస్తోందని భార్య వరలక్ష్మి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సత్యనారాయణ కేసు నమోదు చేశారు.

ఏఎంసీ విశ్రాంత ప్రిన్సిపాల్‌కు సత్కారం

మహారాణిపేట, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర వైద్య కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ బుచ్చిరాజును మహారాణిపేట ప్రకృతి చికిత్సాలయంలో విశాలాక్షి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. బుచ్చిరాజు సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు, పిల్లల వైద్య నిపుణులు ఎస్ఏఎన్ మూర్తి, డాక్టర్లు ఎస్ సుబ్రహ్మణ్యం, కృష్ణకిశోర్, లక్ష్మీనారాయణ, రవికుమార్, ప్రొఫెసర్ పుల్లారావు, చంద్రశేఖర్, రాంబాబు, ఆల్బర్ట్ పాల్గొన్నారు.

పార్కు నవీకరణకు మోక్షమెన్నడో?

» మురళీనగర్‌లో అధ్వాన స్థితికి చేరుతున్న వైనం

» ప్రతిపాదన మేరకు మంజూరు కాని నిధులు

» వినతులిస్తున్నా స్పందించని జీవీఎంసీ అధికారులు

మురళీనగర్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలోనే పేరొందిన మురళీనగర్‌లో అభివృద్ధి పనులకు క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తప్పడంలేదు. ఈ ప్రాంతంలోని పార్కులు నగరంలో మరెక్కడా లేవు. మురళీనగర్, ఎన్‌జీజీఓస్ కాలనీ, మాధవధార ఉడాకాలనీల్లో లే అవుట్‌లు ఏర్పాటు చేసిన నాటి నుంచి ప్రణాళికాయుతంగా పార్కులను తీర్చిదిద్దారు. ఇపుడు ఈ ప్రాంతంలో 15 పార్కులున్నాయి.

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో

మురళీనగర్‌వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో 1990లోనే ఉద్యానవనం ఏర్పాటు చేశారు. ప్రజల ఆహ్లాదానికి, యువత వ్యాయామానికి, చిన్నారుల ఆటలకు వీలుగా పాలకవర్గం ఈ పార్కును తీర్చి దిద్దుకుంటూవచ్చారు. అయితే, తాజాగా నిధుల కొరత, జీవీఎంసీలో బిల్లులు నిలిచి పోవడంతో పార్కులో ప్రాధాన్యమున్న పనులకూ మోక్షం లభించడం లేదు.

రెండేళ్ల నాటి బిల్లులకూ కదలిక లేదు

పాలకవర్గ అధ్యక్షుడిగా 2023- 24 కాలంలో పనిచేసిన పల్లా చంద్రమౌళి పార్కు నవీకరణకు సభ్యుల ఆమోదం మేరకు రూ.80 లక్షలతో అభివృద్ధి పనులకోసం జీవీఎంసీకి వినతులు అందించారు. స్థానిక 50వ వార్డు వైసీపీ కార్పొరేటరు వి.ప్రసాద్‌ను సహకరించాలని కోరారు. ఆయన



విరిగిపోయిన పార్క్ ప్రహరీ గోడ

వచ్చి చూసి వెళ్లినా పనులు మాత్రం ముందుకు సాగలేదు. వాకింగ్ ట్రాక్ విస్తరణ, ప్రహరీ వాల్, పార్క్‌లో పిల్లల ఆట పరికరాల మరమ్మతులు, కళా వేదిక విస్తరణ పనుల కోసం ఇచ్చిన వినతులు బుట్టదాఖలయ్యాయి. ఇప్పుడు 2025 కొత్త కమిటీ అధ్యక్షుడిగా ఎస్.భానుప్రకాష్ జీవీఎంసీ అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారు. ఎంతోమందికి ఉపయోగపడుతున్న ఈ పార్కులో సభ్యులు తమ సొంత నిధులతో ప్రతి నెలా వైద్యశిబిరం, ప్రత్యేక రోజుల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. గత అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు రూ.75 వేలను సాయంగా అందించారు. అన్ని రంగాల్లో ఎంతో కీలకంగా ఉన్న ఈ పార్కు అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని కమిటీ సభ్యులు కోరుతున్నారు.

యువతలో సృజనాత్మకతను వెలికితీయాలి

» సీబీసీ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్ చౌదరి



విద్యార్థికి ధ్రువపత్రాన్ని అందజేస్తున్న రాజేందర్ చౌదరి తదితరులు

కంచరపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): యువతలో సృజనాత్మకతను వెలుగులోకి తీసుకువచ్చేలా కృషి చేయాలని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ అదనపు డైరెక్టర్ జనరల్ రాజేందర్ చౌదరి పిలుపునిచ్చారు. సీబీసీ ఆధ్వర్యంలో మంగళవారం కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాతీయ భద్రతా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. వేవ్స్ 2025 సమ్మిట్ ఆన్‌లైన్ చాలెంజ్‌లో యువత ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. భద్రతా చర్యలపై అవగాహన కల్పించడం, ప్రజల్లో భద్రతా సంస్కృతిని బలపరచడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఎన్ఐఎస్ఎఫ్ జనరల్ మేనేజర్ జీఆర్‌పి కృష్ణ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో భద్రతా నియమాలు అమలుచేయడం కీలకమన్నారు. కార్యక్రమంలో భాగంగా ఒకమొక్క-తల్లి పేరుతో విద్యార్థులకు వ్యాచరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. సీబీసీ విశాఖ ఫీల్డ్ అధికారి శ్రీరామ్మూర్తి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పైడిమాంబ అమ్మవారి ప్రధాన పండగ



పైడిమాంబ అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళలు

కంచరపాలెం,మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక తిక్కవానిపాలెంలోని పైడితల్లమ్మ అమ్మవారి ప్రధాన పండగను మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. కంచరపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని, మొక్కులను చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ అధ్యక్షుడు వాసుదేవరావు, రాజు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ప్రతిమలతో భక్తులు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

ముత్యాలమ్మవారి ఘటాల ఊరేగింపు

సీతమ్మధార: నక్కవానిపాలెం గ్రామ దేవత ఏడుగుళ్ల ముత్యాలమ్మ ఘటాలను మంగళవారం ఊరేగించారు. ఘటాల్లో భక్తులు బియ్యం, అన్నం వేసి పూజలు చేశారు. రామాలయం వీధి పెద్దింటికి చేరుకున్నాయి. కాటరాజు రెడ్డి, శ్యామలరెడ్డి, వెంకటేష్ రెడ్డి, రవికుమార్ రెడ్డి, గురుమూర్తిరెడ్డి, వేణురెడ్డి, శ్రీనుబాబు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

» అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం

మహారాణిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు త్వరితగతిన ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన గురజాడ కళాక్షేత్రం వేదిక అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులు చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహించాలన్నారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం పెయింటింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. మహిళా సంఘాలు, ఎన్జీవోలకు ప్రాధాన్యత కల్పించి కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు కార్యక్రమం విజయవంతం చేయడంలో ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సర్వే వేగవంతం చేయాలి

మహారాణిపేట: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు వీలుగా గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా



మహిళా దినోత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు కలెక్టరేట్‌లో మంగళవారం గ్రామ/వార్డు సచివాలయాల కీలక కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేల పురోగతిని సమీక్షించారు, పీ4 సర్వే, మిస్సింగ్ హౌస్‌హోల్డ్ డేటా, ఎంఎస్ఎంఈ సర్వే, జియో కోఆర్డినేట్, వర్క్ ఫ్రమ్ హోం సర్వేలను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేకంగా పర్యవేక్షించి, త్వరితంగా పూర్తిచేయించాలని ఆదేశించారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించాలని, పెండింగ్‌లో ఉన్న సర్వేల ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. సర్వేలు సమర్థంగా నిర్వహిస్తే ప్రభుత్వ పథకాలను సత్వరం లబ్ధిదారులకు అందించే వీలుంటుందన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నాయకులు

మహారాణిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని టీడీపీ గ్రేటర్ 29వ వార్డు అధ్యక్షుడు ఉరుకూటి గణేశ్ అన్నారు. చందక వీధి సమావేశమందిరంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తోందన్నారు. పార్టీ నాయకుడు మద్దాడి శేషాచారి సౌజన్యంతో బియ్యం, నిత్యావసరాలను బూత్ ప్రెసిడెం ట్లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజాన బంగారురాజు, పల్లా మధు, పెందుర్తి శైలజాలక్ష్మి, బోరరాజు, కిశోర్, అప్పలరాజు, గోపమ్మ, కనకమహా లక్ష్మి, అప్పలరాజు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాసన పోటీలకు ఏఎంసీ డాక్టర్ లక్ష్మణరావు



లక్ష్మణరావును అభినందిస్తున్న ఏఎంసీ ప్రిన్సిపాల్

విశాఖపట్నం, స్పోర్ట్సు, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత సివిల్ సర్వీసెస్ యోగాసన చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ అటానమీ డాక్టర్ లక్ష్మణరావు ప్రాతినిధ్యం వహిస్తారు. చండీగఢ్‌లో ఈ టోర్నీ జరగనుంది. ఈ సందర్భంగా ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ఎం సంధ్యాదేవి మంగళవారం తన చాంబర్‌లో లక్ష్మణరావును అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌వోడీ ఆఫ్ కమ్యూనిటీ మెడిసిన్ డాక్టర్ ఎ.కృష్ణవేణి, అటానమీ హెచ్‌వోడీ డాక్టర్ రవీంద్ర కిశోర్, ప్రొఫెసర్ డాక్టర్ రాధిక, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎంఎస్ఎన్.పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీని కలిసిన సెయింట్ జోసెఫ్ అధ్యాపకులు

జ్ఞానాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఏయూ వీసీగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కళాశాల నిర్వహణ, నాక్ గుర్తింపు తదితర అంశాలపై ప్రిన్సిపాల్ డా.సిస్టర్ షైజీని వీసీ అడిగి తెలుసుకున్నారు. వీసీని కలిసినవారిలో అధ్యాపకులు డా.వీకే జయలక్ష్మి, డా.సుధ, డా.పి.అరుణ, డా. సుజాత, సిస్టర్ మేరీ, నాన్సీ, దిపాలి, తదితరులు పాల్గొన్నారు.



వీజీ రాజశేఖర్‌తో సెయింట్ జోసెఫ్ కళాశాల అధ్యాపకులు

మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి

సీతంపేట, మార్చి 4, (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్స్, మోటర్ కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. రామాటాకీస్ కూడలిలో గల ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్స్ అండ్ మోటర్ వర్కర్స్ రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వామనమూర్తి మాట్లాడుతూ ఆటోడ్రైవర్స్, మోటా



నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

ర్ కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న జీవో నంబరు 21,31 రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, 21, 31 జీవోలను రద్దుచేస్తామని, వాహన మిత్ర కింద రూ.15వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్డు టాక్స్, గ్రీన్ టాక్స్, లేడర్ టాక్స్, టోల్ ప్లాజా ఫీజులను 30 శాతానికి తగ్గిస్తామన్నారని, అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఒక్క హామీనీ అమలుచేయలేదన్నారు. చట్టసభల్లో ఎమ్మెల్యేలు మోటారు కార్మికుల సమస్యలు చర్చించి హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యు.శివాజీ, రావి కృష్ణ, దేవుడు, ఈశ్వర్, ఎస్.అప్పలరాజు, టి.రవి, తదితరులు పాల్గొన్నారు.

6న గీతకార్మికుల మద్యం దుకాణాలకు లాటరీ

» వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో ఏర్పాట్లు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీతకార్మికులకు కేటాయించిన 14 మద్యం దుకాణాలకు ఈనెల ఆరున లాటరీ తీయనున్నట్టు జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు. 14 దుకాణాలకు 316 దరఖాస్తులు వచ్చాయి. గతనెల పదో తేదీన లాటరీ తీయాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రక్రియ నిలిచిపోయింది. మంగళవారంతో కోడ్ తొలగిపోవడంతో లాటరీ నిర్వహణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. గురువారం ఉదయం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్ సమక్షంలో లాటరీ తీసి దుకాణాలను కేటాయిస్తామని అధికారులు తెలిపారు.

సందడిగా సంక్రాంతికి వస్తున్నాం చిత్ర విజయోత్సవం

డాబాగార్డెన్స్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి వస్తున్నాం చిత్ర విజయోత్సవ సంబరాలను డాబాగార్డెన్స్ వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం నిర్వహించారు. జిల్లా, సిటీ వైడ్ వెంకటేష్ అండ్ రానా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అతిథులుగా శ్రీ వెంకటేశ్వర ఫిల్మ్స్ విజయభాస్కర్, సురేష్ ఫిల్మ్స్ వేణుబాబు, వెంకటేష్‌బాబు, నిర్వాహకులు శంకరరావు హాజరై కేక్ కట్ చేశారు. లీలామహల్ థియేటర్ సిబ్బందికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీనుబాబు, శంకరరావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానాపురం రహదారిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు

జ్ఞానాపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జ్ఞానాపురం ప్రధాన రహదారిలో అధికంగా పాఠశాలలు ఉండడంతో ప్రమాదాలను నియంత్రించేందుకు వీలుగా రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నారు. అత్యధిక ట్రాఫిక్ రద్దీ నెలకొంటున్న జ్ఞానాపురం ఫ్లైఓవర్ నుంచి ఎర్నిమాంబ దేవాలయం వరకు స్పీడు బ్రేకర్లు వేయాలనే స్థానికల వినతి మేరకు మంగళవారం జోన్-5 ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో పాటు రహదారిపై ఉన్న గుంతలను పూర్తిగా పూడ్చివేశారు. ఏఈ సతీశ్, వర్క్ ఇన్స్‌పెక్టర్ గంగాధర్ పనులు పర్యవేక్షించారు. కాగా స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటుపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



స్పీడు బ్రేకర్లు వేస్తున్న దృశ్యం

నజీర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని ముస్లింల ఆందోళన

అక్కయ్యపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ముస్లిం కోటాలో ఎమెల్సీ పదవిని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ నజీర్‌కు కేటాయించాలని మజీద్ ఈ కుబా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ హబీబ్, ప్రధాన కార్యదర్శి యాసీన్ ప్రభుత్వాన్ని కోరారు. గ్రేటర్ 44వ వార్డు పెద్దూరు మసీద్‌లో మంగళవారం ఇఫ్తార్ విందు సమావేశాన్ని నిర్వహించారు. నజీర్ పార్టీ బలోపేతానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు.



నిరసన ప్రదర్శనలో మజీద్ ఈ ఫర్కాన్ ముస్లిం సభ్యులు

మహారాణిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ స్థానాన్ని మహ్మద్ నజీర్‌కు కేటాయించాలని మజీద్ ఈ ఫర్కాన్ మసీదు ప్రెసిడెంట్ నౌషద్ భాయ్ కోరారు. బౌడారా రోడ్డులో ఉన్న మజీద్ ఈ ఫర్కాన్ మసీదు వద్ద రంజాన్ ప్రార్థనల అనంతరం ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో సుమారు ఆరు లక్షల మంది ముస్లింలున్నారని వారికి న్యాయం చేసేందకు మైనారిటీ కోటాలో నజీర్‌కు ఎమ్మెల్సీ స్థానం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ముస్లిం యంగ్‌మన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఫైజల్ రెహమాన్ అహ్మద్, ముజీబ్ రెహ్మాన్, బాబు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగికి పర్యాటక పగ్గాలు!

... 5వ పేజీ తరువాయి

ఉందనే ఆరోపణలు కూడా వచ్చాయి. సంస్థ పరువు పోయేలా వ్యవహరిస్తున్నారని వైసీపీ హయాంలో దాసును ఈ జిల్లా నుంచి బయటకు పంపించేశారు. ఇప్పుడు ఆయనే కూటమి ప్రభుత్వానికి ముద్దుగా కనిపించడంతో తీసుకువచ్చి రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించారు. విశాఖకు ఎంతోమంది విదేశీ పర్యాటకులు, రాయబారులు, ఇతర రాష్ట్రాల ప్రతినిధులు వస్తారు. వారితో డీటీఓ హోదాలో దాసు చర్చలు జరపగలరా?, ప్రాజెక్టులపై ఉన్నతాధికారులకు నివేదికలు ఇవ్వగలరా?...అంటే ఆ శాఖలో ఎవరూ నోరు విప్పడం లేదు. అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తికి అత్యంత కీలకమైన ప్రాంతంలో బాధ్యతలు ఇవ్వడంపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రజా ప్రతినిధులైతే నెత్తీనోరు కొట్టుకుంటున్నారు. డిప్యూటీ కలెక్టర్ స్థాయి అధికారులు నియమించాలని తాము కోరితే...ఏరికోరి ఆరోపణలు ఉన్నవారిని నియమిస్తున్నారని, తెర వెనుక ఏమి జరుగుతున్నదో అర్థం కావడం లేదని వాపోతున్నారు.

ఉక్కులో బిక్కుబిక్కు

... 5వ పేజీ తరువాయి

షాపు, రోలింగ్ మిల్స్‌తో పాటు అనేక అనుబంధ విభాగాలు భారీ షెడ్లలో నిర్వహిస్తున్నారు. నిధులు లేవనే కారణంతో గత రెండేళ్లుగా నిర్వహణ పనులు చేపట్టలేదు. ఇంకా దారుణం ఏమిటంటే ఇటీవల సివిల్ ఇంజనీరింగ్ విభాగాన్ని మూసేసి, అక్కడి ఉద్యోగులను స్ట్రక్చరల్ విభాగానికి తరలించారు. నిర్వహణ లోపం, ఒత్తిడి వల్ల ఎక్కడైనా ఏదైనా జరిగితే పదుల సంఖ్యలో ప్రాణాలకు ముప్పు ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మంగళవారం భద్రతా దినత్సోవం నిర్వహించారు. అసలైన భద్రత గురించి చర్చించలేదు. ఇప్పటికైనా తగిన నిర్వహణ పనులు చేపట్టి, ఆపైనే పూర్తి ఉత్పత్తికి వెళ్లాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

అరకొర వేతనాలతో 102 ఉద్యోగుల వెతలు

... 5వ పేజీ తరువాయి

పంపేందుకు తెలుగుదేశం ప్రభుత్వం గతంలో తల్లీ, బిడ్డ ఎక్స్‌ప్రెస్ పేరుతో వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ వాహనాల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటు సంస్థలకు అప్పగిస్తూ వస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక సంస్థ ఉండగా, ఆ తరువాత వైసీపీ ప్రభుత్వ హయాంలో 'అరబిందో' కాంట్రాక్టు దక్కించుకుంది. ప్రస్తుతం ఆ సంస్థ ఆధ్వర్యంలోనే వాహనాలు నడుస్తున్నాయి. నిర్వహణ సంస్థలకు ప్రభుత్వం ఎంత చెల్లిస్తుందోగానీ... ఉద్యోగులకు మాత్రం ఆశించిన స్థాయిలో వేతనాలు అందడం లేదు. దీంతో ఎంతోమంది ఉద్యోగాలు వదిలి వెళ్లిపోతున్నారు. అందుకే సేవలు సక్రమంగా అందడం లేదు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇప్పటివరకూ ఆరుగురు పైలట్లు ఉద్యోగం మానేసినట్టు చెబుతున్నారు.

102 సిబ్బందిపై చిన్నచూపు

108, 104 వాహనాల మాదిరిగానే 102 వాహనాలు సేవలు అందిస్తున్నాయి. 108, 104 వాహనాల పైలట్లకు సుమారు రూ.15 వేలు నుంచి రూ.30 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు. 102 వాహనాల పైలట్లకు మాత్రం ఏడెనిమిది వేల రూపాయలు మాత్రమే ఇస్తున్నారు. ఈ వాహనాల నిర్వహణ చూస్తున్న అరబిందో కాంట్రాక్టు ఈ నెలతో ముగియబోతోంది. కొత్త సంస్థకు వాహనాల నిర్వహణను అప్పగించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. కొత్త ఏజెన్సీ అయినా కనీసం రూ.18 వేలు వేతనం చెల్లించేలా చూడాలని పైలట్లు కోరుతున్నారు. ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడుతోపాటు పలువురు మంత్రులను కలిసి తమ సమస్యను విన్నవించుకున్నారు.

అధ్వానంగా నిర్వహణ

నిర్వహణ సరిగా లేకపోవడంతో తల్లి, బిడ్డ ఎక్స్‌ప్రెస్‌లు మార్గమధ్యంలో నిలిచిపోతున్నాయి. ఉమ్మడి విశాఖ జిల్లాలో 67 వాహనాలు ఉన్నాయి. అనకాపల్లి జిల్లాలో 22, విశాఖ జిల్లాలో 23, అల్లూరి జిల్లాలో 22 ఉన్నాయి. వీటిలో అనకాపల్లి జిల్లాలో మూడు, విశాఖ జిల్లాలో రెండు, అల్లూరి జిల్లాలో రెండు వాహనాలు నిర్వహణ లోపంతో నిలిచిపోయాయి. ఇంకొన్ని వాహనాలకు టైర్లు, బ్యాటరీ సమస్యలు ఉన్నాయి. అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా ప్రయోజనం లేకుండా పోతోందని ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి వాహనాల ఇబ్బందులను పరిష్కరించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

పంచాయతీలకు మొండిచేయి

... 5వ పేజీ తరువాయి

ఆనందపురం, భీమిలి, పెందుర్తి మండలాల్లో మెజారిటీ పంచాయతీలు, పద్మనాభం మండలంలోని కొన్ని పంచాయతీల్లో భూముల విలువ ఎక్కువ. వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేసిన లేఅవుట్‌లలో క్రయ విక్రయాలు చదరపు గజాల్లో జరుగుతాయి. నగరానికి ఆనుకుని భూముల ధరలు ఎకరా రూ.కోట్లలో పలుకుతుండడంతో రిజిస్ట్రేషన్ల ఆదాయం కూడా భారీగానే వస్తోంది. గంభీరం, ఆనందపురం, వేములవలస, వెల్లంకి, లొడగలవానిపాలెం, పెద్దిపాలెం, మామిడివానిపాలెం,శొంఠ్యాం, గండిగుండం, గిడిజాల, దాకమర్రి, నరవ, గుర్రంపాలెం, సరిపల్లి, చీమలాపల్లి తదితర పంచాయతీల్లో రిజిస్ట్రేషన్ల ద్వారా భారీగా ఆదాయం లభిస్తోంది. గంభీరం పంచాయతీకి ఏడాదికి రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.30 నుంచి రూ.40 లక్షల ఆదాయం రావలసి ఉందని సర్పంచ్ వానపల్లి లక్ష్మి తెలిపారు. రెండేళ్ల నుంచి ఈ ఆదాయం జమ కాకపోవడంతో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని వాపోయారు. కూటమి ప్రభుత్వమైనా రిజిస్ట్రేషన్ల ఆదాయం విడుదల చేయాలన్నారు.దీనిపై జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా రెండేళ్లుగా పంచాయతీలకు రిజిస్ట్రేషన్ నిధులు విడుదల కాలేదన్నారు. దీనిపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు.

కమనీయంగా అప్పన్న నిత్యకల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వైదికులు

సింహాచలం, మార్చి 4(ఆంధ్రజ్యోతి) : వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్యకల్యాణం కమనీయంగా సాగింది. ఇందులో భాగంగా మంగళవారం ప్రాతఃకాలంలో సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి సేవాకాలం, ధూపసేవ, నిత్యహోమం తదితరాలను యథావిధిగా పూర్తి చేశారు. ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో పలు స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. ప్రత్యక్షంగా పాల్గొన్న ఉభయదాతల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనరాధన, పుణ్యాహవచనాలు చేసి షోడశోపచారాలు సమర్పించారు. ఆగమశాస్త్ర విధానంలో కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణలు చేసి వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ జీలకర్రా బెల్లం, మాంగల్యధారణ గావించారు. స్వామికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన అనంతరం భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.

12న కనకమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

ఆరిలోవ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎస్‌కెఎల్‌ఎం నగర్‌లో వెలిసిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయ 12 వ వార్షికోత్సవం ఈ నెల 12 (బుధవారం) వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు అమ్మ వారికి క్షీరాభిషేకాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ, అష్టోత్తర శతనామ కుంకుమార్చనాలు, అనంతరం దర్శనాలు ఉంటాయని తెలిపారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొనాలని కోరారు.

పోక్సో కోర్టు పీపీగా రాజశేఖర్



మహారాణిపేట, మార్చి4 (ఆంధ్ర జ్యోతి): విశాఖ పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బత్తి రాజశేఖర్ నియమితు లయ్యారు. ప్రస్తుతం టీడీపీ జిల్లా న్యాయ విభాగం అధ్యక్షునిగా పనిచేస్తున్న ఆయ నను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఎంపీ శ్రీభరత్, పార్టీ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, గండి బాబ్జిలకు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా గైడ్

- **శఠం:** సంగం, శారద, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ- 2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక),
- **మజాకా:** శ్రీ వెంకటేశ్వర-1, రమాదేవి, శ్రీరామా, గోకుల్, కామేశ్వరి, ఊర్వశి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), లిఖిత (శ్రీహరిపురం),
- **డ్రాగన్ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి),
- **తండేల్ :** శ్రీవెంకటేశ్వర, శ్రీలీలామహల్, నరసింహ(గోపాలపట్నం), అరుణ (పెదగంట్యాడ)
- **సంక్రాంతికి వస్తున్నాం :** మెలోడీ, జగదాంబ, కాంతి, శ్రీనరసింహ (గోపాలపట్నం), లిఖిత (శ్రీహరిపురం), తాతా, రాములమ్మ (తగరపువలస)
- **డాకు మహారాజ్ :** శరత్, మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), గణేష్, సప్తగిరి (తగరపువలస)
- **గేమ్ ఛేంజర్ :** మెలోడీ, సంగం, కామేశ్వరి, కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 33, టమాటా 14, వంకాయలు (తెలుపు)26, వంకాయలు (నలుపు) 15, బెండకాయలు 44, పచ్చిమిర్చి 32, కాకరకాయలు 40, బీరకాయలు 60, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 18, క్యాబేజి 12, క్యారెట్ 30 దొండకాయలు 36, బంగాళ దుంపలు 15, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 74, అల్లం (పాతది)52, బరబాటి 36, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 34, దోస కాయలు 28, వెల్లుల్లి (పెద్దవి) 110, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 30, కీరదోస 28, కాప్సికమ్ 38, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 38 చిలగడదుంపలు 40, కంద 64, దేముడు చిక్కుడు 52, గోరు చిక్కుడు 36, కూర పెండలం 26, బ్రకోలి 55 , నూల్‌కోల్ 30, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 15, పుదీన (కట్ట) 4, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 80, బూడిద గుమ్మడికాయ 30, క్యారపెండలం 22, మామిడి అల్లం 46, బొప్పాయి 42, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	435
విజయనగరం	439
శ్రీకాకుళం	439

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	95
లైవ్ ధర	115
విత్ స్కిన్	200
స్కిన్‌లెస్	210

వేసవి తాపం.. పుచ్చకాయలతో ఉపశమనం

- నగరంలో గొప్ప సీజనల్ బిజినెస్
- అగస్టా జాతి కాయకు అధిక డిమాండ్
- ఒడిశా నుంచి అధికంగా టన్నుల లెక్క దిగుమతి
- ఇక్కడ కిలోల చొప్పున అమ్మకం
- హనుమంతవాక కేంద్రంగా నగరానికి అధిక సరఫరా



హనుమంతవాక జంక్షన్‌లో అమ్మకానికి రాశులుగా పోసిన పుచ్చకాయలు

ఆరిలోవ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : వేసవి తాపం నుంచి బయట పడడానికి చక్కని ఆహారం పుచ్చకాయలు. పుష్కలంగా నీరు ప్రధాన వనరుగా ఉండే పుచ్చకాయ ఆర్యోగపరంగానూ మంచిదేనని వైద్యులు చెబుతుంటారు. అందుకే వేసవి వచ్చిందంటే పుచ్చకాయలకు ఎనలేని డిమాండ్ ఉంటుంది. అనువైన పరిమాణంలో ఉండడం, సులభంగా తినడానికి అవకాశంతో పాటు రుచికరంగా ఉండడంతో పుచ్చకాయలను అందరూ ఇష్టపడతారు.

వేసవి సమీపించడంతో కొందరు వ్యాపారులు హనుమంతవాక జంక్షనులో పుచ్చకాయల వ్యాపారాన్ని మొదలు పెట్టారు. ఇవి ఆంధ్రప్రదేశ్‌లోని పలు ప్రాంతాల్లో మాత్రమే కాకుండా ఒడిశాలోని భంగిరి, సోనాపురి ప్రాంతాల్లో ఎక్కువగా పండుతాయి. అక్కడ నుంచి లారీలతో నగరానికి తీసుకొస్తారు. టన్ను రూ.పది వేల వరకు ఉంటుంది.. ఇక్కడ కిలో రూ.25 రూ.20 చొప్పున విక్రయిస్తారు. కాయ పరిమాణాన్ని బట్టి ఒక లారీలో సుమారు 7 నుంచి పది టన్నుల వరకు పుచ్చకాయల్ని తీసుకు వస్తామని వ్యాపారులు తెలిపారు. ఈ హనుమంతవాక జంక్షన్‌లో నాలుగు చోట్ల పుచ్చకాయలను ఎక్కువగా విక్రయిస్తారు. నగరంలో అధికంగా అగస్టా అనే రకం కాయలు అమ్ముడు అవుతుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ కాయ ఒక్కోటి సుమారు మూడు నుండి నాలుగు కిలోల వరకు ఉంటుంది. ఈ కాయలో పూర్తిగా జ్యూస్ ఉంటుంది. లోపల ఎరుపుదనంతో ఉంటుంది. కాయ బరువు గా ఉంటే లేతది అని, కాయ తేలికగా ఉంటే ముదరగా ఉంటుందని వ్యాపారులు తెలిపారు. ముదర కాయ లోపలి భాగంలో చక్రాలు చక్రాలుగా ఉంటుంది. మూడు రోజులకు ఒకసారి ఒడిశా నుంచి ఈ కాయలు తీసుకువస్తామని తెలిపారు. ఈ కాయలు ఆరోగ్యానికి కూడా మంచిది. వేసవిలో రద్దీగా ఉండే ప్రాంతాల్లో కొందరు వ్యాపారులు కాయను ముక్కలు కోసి అమ్మకాలు సాగిస్తారు. ఎండ వేడిమి నుంచి చక్కని ఉపశమనం కావడంతో ఆ ముక్కలను తినేందుకు జనం ఎగబడతారు. అందుకే వేసవిలో పుచ్చకాయల వ్యాపారం ఎవర్‌గ్రీన్ అని పేర్కొంటారు. మధుమేహగ్రస్తులు కూడా తినవచ్చని వైద్యులు చెబుతున్నారు. అధికంగా నీటితో నిండి ఉండడం, తొందరగా అరిగిపోయే లక్షణం ఉండడం వల్ల ఈ కాయను వేసవిలో అధికంగా ఇష్టపడుతుంటారు.

మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- అధికారులకు కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశం



మహిళా దినోత్సవ ఏర్పాట్లపై మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు త్వరితగతిన ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 8వ తేదీన గురజాడ కళాక్షేత్రం వేదిక అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు వివిధ శాఖల అధికారులు చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. క్రీడాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖల మహిళా ఉద్యోగులకు క్రీడా పోటీలను నిర్వహించాలన్నారు. జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం పెయింటింగ్ పోటీలు నిర్వహించాలన్నారు. మహిళా సంఘాలు, ఎన్జీవోలకు ప్రాధాన్యత కల్పించి కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించాలని సూచించారు. మహిళా శిశు సంక్షేమశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, విద్య, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు కార్యక్రమం విజయవంతం చేయడంలో ముఖ్య భూమిక పోషించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాలోని వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సచివాలయ సర్వే వేగవంతం చేయాలి

మహారాణిపేట: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు మరింతగా చేరువ చేసేందుకు వీలుగా గ్రామ/వార్డు సచివాలయాల ద్వారా నిర్వహిస్తున్న వివిధ రకాల సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు కలెక్టరేట్‌లో మంగళవారం గ్రామ/వార్డు సచివాలయాల కీలక కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సర్వేల పురోగతిని సమీక్షించారు, పీ4 సర్వే, మిస్సింగ్ హౌస్‌హోల్డ్ డేటా, ఎంఎస్‌ఎంఈ సర్వే, జియో కోఆర్డినేట్, వర్క్ ఫ్రమ్ హోం సర్వేలను మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు ప్రత్యేకంగా పర్యవేక్షించి, త్వరితంగా పూర్తిచేయించాలని ఆదేశించారు. ఆధార్ లేని పిల్లలను గుర్తించాలని, పెండింగ్‌లో ఉన్న సర్వేల ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.

సర్వేలు సమర్థంగా నిర్వహిస్తే ప్రభుత్వ పథకాలను సత్వరం లబ్ధిదారులకు అందించే వీలుంటుందన్నారు.

చిమ్మచీకట్లో కొండవాలు ప్రాంతాలు

ఆరిలోవ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : చినగదిలి, పెదగదిలి, ఆరిలోవ ప్రాంతాల్లో గల వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు అలంకారప్రాయంగా మిగిలి ఉన్నాయని స్థానికులు అంటున్నారు. ఈ ప్రాంతాలన్నీ కొండవాలులో ఉండడంతో సాయంత్రమైతే చీకటి పడినట్టుగా ఉంటుంది. వీధి దీపాలు వెలగకపోవడంతో ఈ ప్రాంతాలు చిమ్మచీకట్లో మగ్గుతున్నాయి. ఎన్నిసార్లు వినతులు సమర్పించినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొండవాలు ప్రాంతాలు కావడంతో రాత్రి వేళల్లో విష సర్పాలు, పురుగులు తిరుగుతుంటాయని, ఆ సమయంలో బయటకు రావడానికే భయం వేస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు, వృద్ధులు రాత్రి వేళల్లో వీధుల్లో తిరగలేకపోతున్నారని, వారిని బయటకు పంపడానికే భయం వేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రమాదమని తెలిసినా.. ఏమిటో ఈ ఆటలు



పాకుతూ గోడపైకి ఎక్కుతున్న యువకులు

సింహాచలం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాస్త అజాగ్రత్తగా ఉంటే కాలుజారటంతో పెను ప్రమాదం జరగే పరిస్థితి ఉన్నప్పటికీ దానిని పట్టించుకోకుండా కొందరు యువత తమ ప్రాణాలతో చెలగాటలు ఆడుతున్నారు. సింహగిరి మెట్లమార్గంలో వేగవతిదార(చాకిదార) వద్ద బస్టాండ్ సమీపంలో దేవస్థానం ఇంజినీరింగ్ అధికారులు కోటగోడ లాంటి ఒక గోడను కొన్నేళ్ల క్రితం నిర్మించారు. గోడను నిర్మించిన విధానం కారణంగా దానిలోని ఎత్తుపల్లాలు ఉంది. దీంతో కొందరు ఆకతాయి యువకులు గోడపైకి తొండ, ఉడుతా, పాము వంటి జీవుల మాదిరిగా పాకుతూ ఎక్కుతూ ఎంజాయ్ చేస్తున్నారు. అయితే గోడ ఎక్కే క్రమంలో ఏమాత్రం పట్టు తప్పినా కింద పడితే పెను ప్రమాదానికి గురయ్యే పరిస్థితి ఉంది. దీన్ని వారు పట్టించుకోవడం లేదు. ఆ గోడను అధికారులు వెంటనే క్రమ పద్ధతిలో నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

కేడీపీఎం స్కూలులో పోక్సో చట్టంపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న డీఎల్‌ఎస్‌ఏ జడ్జి ఎం.వెంకట శేషమ్మ, ఐసీడీఎస్ అధికారులు, స్కూలు ఉపాధ్యాయులు

పెదవాల్తేరు, మార్చి 4, (ఆంధ్రజ్యోతి) : ఈస్టు పాయింట్ కాలనీలో గల కేడీపీఎం స్కూలులో విద్యార్థులకు పోక్సో చట్టం, అందులో ఉన్న అనేక అంశాలపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌ఎస్‌ఏ జడ్జి ఎం.వెంకటశేషమ్మ మాట్లాడుతూ బాలబాలికలను లైగింక వేధింపుల నుంచి ఎలా కాపాడు కోవాలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు వివరించారు. ఒకవేళ ఎవరైనా ఈ వేధింపులకు గురైతే నిర్భయంగా ఫిర్యాదు చేయాలని విద్యార్థులకు సూచించారు. ఇలాంటి అవగాహన సదస్సులను ప్రతి పాఠశాలలో నెలకు ఒకటి లేదా రెండుసార్లు నిర్వహించాలని ఎంఈవోకు సూచించారు. అనంతరం స్త్రీ, శిశు సంక్షేమశాఖ అధ్వర్యంలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో వెంకట శేషమ్మ, జయాదేవి తదితరులు పాల్గొని పోక్సో చట్టం గురించి నినాదాలు చేశారు.

కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ జి.జయాదేవి, ఐసీడీఎస్ పీవో, డీపీవోలు, ఎంఈవో రామారావు, సీడబ్ల్యూసీ మెంబర్లు ఎం.రజిని, డాక్టర్ ఖలీషాబేగం, శ్రీలత, బి.మమత, ఐ.అనిజ, సోషల్ వర్కర్ సులేఖ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

6న గీత కార్మికుల మద్యం దుకాణాలకు లాటరీ

- వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో ఏర్పాట్లు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికులకు కేటాయించిన 14 మద్యం దుకాణాలకు ఈనెల ఆరున లాటరీ తీయనున్నట్టు జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ తెలిపారు. 14 దుకాణాలకు 316 దరఖాస్తులు వచ్చాయి. గతనెల పదో తేదీన లాటరీ తీయాల్సి ఉండగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ప్రక్రియ నిలిచిపోయింది. మంగళవారంతో కోడ్ తొలగిపోవడంతో లాటరీ నిర్వహణకు అధికారులు కసరత్తు ప్రారంభించారు. గురువారం ఉదయం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ థియేటర్‌లో కలెక్టర్ ఎంఎన్‌హరేంధిర ప్రసాద్ సమక్షంలో లాటరీ తీసి దుకాణాలను కేటాయిస్తామని అధికారులు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై అధికారులు నిర్లక్ష్యం

ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే ప్రతిస్పందించేది..



పొరుగింటి వారు ఫిర్యాదు చేయడంతో కూల్చివేస్తున్న షెడ్డు

వెంకోజీపాలెం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పాత ఇంటి పునరుద్ధరణకు సిద్ధపడితే చాలు అక్కడకు వెంటనే ప్రత్యక్షమయ్యే ఇక్కడి టౌన్ ప్లానింగ్ అధికారి. గత రెండు నెలలుగా అనుమతులు లేకుండా విశాలమైన స్థలంలో నిర్మాణం చేపడుతున్నా ఎక్కడా కానరాలేదు. తమకు ఇబ్బంది కలుగుతుందని పొరుగింటి వారు ఫిర్యాదు చేస్తే తప్ప ఇక్కడ అక్రమ నిర్మాణం జరుగుతుందన్న స్పృహ రాలేదు. ఇదీ 16వ వార్డులోని ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఎదురుగా నిర్మాణమవుతున్న అక్రమ షెడ్‌పై సచివాలయం, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది వ్యవహరించిన తీరు. వివరాలిలా ఉన్నాయి.

గత రెండు, మూడు నెలల క్రితం సుమారు 300 గజాల విస్తీర్ణం కలిగిన స్థలం నిర్వీర్యంగా ఉండి, చెత్తాచెదారంతో నిండిపోయి ఉండేది. స్థల యజమాని ఇటీవల ఈ స్థలాన్ని కోర్టులో కేసు గెల్చి పరిసరాలను శుభ్రం చేసుకుని అందులో ఒక చిన్న గదిని నిర్మించుకుని, చుట్టూ ఓపెన్ షెడ్డు నిర్మించుకున్నారు. అయితే ఈ షెడ్డు నిర్మాణానికి ఎటువంటి అనుమతులను సదరు యజమాని తీసుకోలేదు. అయితే చుట్టూ అడుగు స్థలం కూడా వదలకుండా షెడ్డును నిర్మించారు. దీంతో షెడ్డుకు పక్కన్న ఉన్న ఇళ్ల యజమానులు జీవీఎంసీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్‌ప్లానింగ్ కార్యదర్శి పద్మప్రియకు, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ అదికారురులు, సిబ్బందికి కళ్లు తెరుచుకున్నాయి. ఇక్కడొక అక్రమ నిర్మాణం చేస్తున్నారని అర్థమైనట్టుంది. వెంటనే.. ఎక్సకవేటర్ సాయంతో వచ్చి షెడ్డును తొలగించారు. అయితే గత రెండు, మూడు నెలల నుంచి ఇక్కడ నిర్మాణం సాగిస్తున్నా కార్యదర్శి పద్మప్రియకు గానీ, ఇతర అధికారులకు గానీ కానరాక పోవడం పట్ల స్థానికులు పలు విమర్శలు చేస్తున్నారు. వీరు యజమానుదారులతో కుమ్మకై ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు చేపట్టలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాంట్రాక్టు కార్మికుల సమ్మె వాయిదా

ఉక్కుటౌన్‌షిప్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంటులోని కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7వ తేదీన తలపెట్టిన నిరవధిక సమ్మెను ప్రస్తుతా నికి వాయిదా వేసిననట్టు కార్మిక సంఘ నాయకులు తెలిపారు. ఈ నెల 11న రీజినల్ లేబర్ కమిషనర్ (ఆర్ఎల్‌సీ) సమక్షంలో ఉక్కు యాజమాన్యం, కార్మిక సంఘాల మధ్య చర్చలు జరగనున్న నేపథ్యంలో ఏడున తలపెట్టిన సమ్మెను వాయిదా వేశామన్నారు. ఆ చర్చల్లో కార్మికులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోతే నిరవధిక సమ్మె చేస్తామని వారు స్పష్టం చేశారు. ఆర్ఎల్‌సీ సమక్షంలో ప్లాంట్ యాజమాన్యంతో జరిగే చర్చల్లో తమకు అనుకూలంగా నిర్ణయాలు జరిగేలా కార్మిక సంఘాల నేతలు చూడాలని కాంట్రాక్టు కార్మికులు కోరుతున్నారు. ప్రస్తుతం ప్లాంటులో సుమారు 9 వేల మంది కాంట్రాక్టు కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. కార్మిక సమస్యలను పరిష్కరిస్తేనే తాము సమ్మె ప్రతిపాదన విరమిస్తామని అంటున్నారు.

నకిలీ పోలీసుల పట్ల అప్రమత్తత అవసరం

- ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ అన్నెపు నర్సింహమూర్తి, ఎంవీపీ సీఐ మురళి, ఎస్ఐ ధనుంజయ్‌నాయుడు

ఎంవీపీ కాలనీ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : పోలీసుల పేరిట మోసాలకు పాల్పడుతున్న వారితో జాగ్రత్తగా ఉండాలని సహాయ పోలీస్ కమిషనర్ అన్నెపు నర్సింహమూర్తి సూచించారు. ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసులమంటూ మోసాలకు పాల్పడుతున్న నకిలీ పోలీసుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏమాత్రం అనుమానం వచ్చినా, ఫిర్యాదు చేయాలని కోరారు. ఉద్యోగాలు వేయిస్తామనో లేదా కేసుల నుంచి రక్షిస్తామనో ఏదో ఒక మోసపూరిత మాటలతో డబ్బులు వసూలు చేసేవారి పట్ల ప్రజలు తెలివిగా వ్యవహరించాలని అన్నారు. నకిలీ పోలీసుగా చలామణి అయిన నగరంలోని బాజీ జంక్షన్ ప్రాంతీయుడు లోచన్ కుమార్‌ను అరెస్టు చేసినట్టు ఏసీపీ తెలిపారు. లోచన్‌పై ఇప్పటికే గోపాలపట్నం, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్టు తెలిపారు. గతంలో వివిధ సందర్భాల్లో పోలీసు అధికారులతో తీసుకున్న ఫోటోలు, పేపర్ క్లిప్పింగులను చూపించి, తాను డిపార్టుమెంటులో పని చేస్తున్నట్టు చెప్పుకుని పలువురి వద్ద లోచన్ డబ్బులు వసూలు చేశాడని తెలిపారు. పోలీసులు సీజ్ చేసిన వాహనాలు తిరిగి ఇప్పిస్తానని చెప్పి, ఓ వ్యక్తి నుంచి రూ.69 వేలు వసూలు చేశాడని చెప్పారు. ఈ నగదును రికవరీ చేసినట్టు వెల్లడించారు. అనుమానాస్పదంగా మాట్లాడేవారు మీ దృష్టిలో ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు. సమావేశంలో ఎంవీపీ సీఐ జె.మురళీ, ఎస్ఐ ధనుంజయ్‌నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆరోగ్యంపైనా శ్రద్ధ వహించాలి

ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల వైద్య నిపుణురాలు హిమబిందు

ఆరిలోవ, మార్చి4(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు నిరంతరం పరీక్షల ఒత్తిడి, మార్కుల సాధనపైనే దృష్టి సారించడం సరికాదని, ఆరోగ్యంపైనా కాస్త శ్రద్ధతో మెలగాలని ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ హిమబిందు పేర్కొన్నారు. అందుకే ప్రతి విద్యార్థి 20-20-20 నిబంధనలు పాటించాలన్నారు. దీని అర్థం 20 నిమిషాలు- 20సెకన్ల పాటు 20 అడుగుల దూరాన్ని పాటించాలని సూచించారు. మారిన జీవనయానంలో పొడి కళ్లు, తలనొప్పులు, చెదిరిన చూపు, మైగ్రేన్ వంటి లక్షణాలు సర్వ సాధారణ సమస్యలు అవుతున్నాయని, వాటి ఫలితంగా విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బంది ఎదురవుతోందన్నారు. కాబట్టి పరీక్షలకు వెళ్లే ముందు విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న నేత్ర వైద్యశాలకు వెళ్లి నేత్ర పరీక్షలు చేయించుకొని వైద్యుల సలహాలు,సూచనలు పాటించాలని అమె సూచించారు. బాగా వెలుతురు, గాలి వచ్చే గదుల్లో మాత్రమే చదవాలన్నారు. నిద్రకు తగిన పాధాన్యమిస్తే కంటికి ఒత్తిడి తగ్గుతుందన్నారు.

జాతీయ ఆర్చరీ టోర్నీకి జిల్లా క్రీడాకారులు

విశాఖపట్నం, స్పోర్ట్స్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జాతీయ అండర్-10, 13, 15 బాలబాలికల విలువిద్య చాంపియన్‌షిప్ టోర్నీలో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి చిన్నారులు పాల్గొననున్నారు. ఈనెల 20 నుంచి గుంటూరులో జరగనున్న ఇండి యన్ రౌండ్ ఈవెంట్ అండర్-15 బాలుర విభాగంలో ఎస్.రామచైతన్య, బి.మనిత్, పి.రాథోడ్, బాలికల విభాగంలో సాయి మనస్వి కనకల, బి.శ్రీవైష్ణవి, అండర్-13 బాలుర విభాగంలో వి.లలిత్ సాయితేజ, ఎస్.తేజేశ్వరరావు, ఆశ్రిత్ సాయి, బాలికల విభాగంలో ఆద్య వేమూరి, కె.చోద్య నందిత, అండర్-10 బాలుర విభాగంలో ఎస్వి.శరత్ వర్మ, పి.ఠాగూర్ అక్షిత్, బి.వెంకటవిరాజ్ పాల్గొంటారు. ఇక కాంపౌండ్ అండర్-13 బాలికల విభాగంలో వి.యశస్వి, ఆద్య వేమూరి, రికర్వ్ ఈవెంట్ బాలికల అండర్- 13లో ఎస్.తన్మయ్‌శ్రీ, అండర్-10లో ఎస్.కన్విక్‌శ్రీ, అండర్-10 బాలుర విభాగంలో ఎల్.సాత్విక్ సుదేవి, ఎస్.శశికాంత్ ఆడనున్నారు. చిన్నారులను జిల్లా అర్చరీ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.సూర్యనారాయణరెడ్డి, కె.నిశాంత్, పి.సత్యనారాయణ తదితరులు అభినందించారు.

మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటుచేయాలి




నిరసన తెలుపుతున్న ఆటో డ్రైవర్లు

సీతంపేట, మార్చి 4, (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్స్, మోటర్ కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. రామాటాకీస్ కూడలిలో గల ఆటో స్టాండ్ వద్ద ఆటో డ్రైవర్స్ అండ్ మోటర్ వర్కర్స్ రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం ఆందోళన చేపట్టారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన వామనమూర్తి మాట్లాడుతూ ఆటోడ్రైవర్స్ మోటర్ కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న జీవో నంబరు 21,31 రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వస్తే మోటారు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, 21, 31 జీవోలను రద్దుచేస్తామని, వాహన మిత్ర కింద రూ.15వేల చొప్పున ఇస్తామని చంద్రబాబు ఎన్నికల్లో హామీ ఇచ్చారన్నారు. పెంచిన థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్, రోడ్డు టాక్స్ గ్రీన్ టాక్స్, లేడర్ టాక్స్, టోల్‌ప్లాజా ఫీజులను 30 శాతానికి తగ్గిస్తామన్నారని, అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచినా ఒక్క హామీనీ అమలుచేయలేదన్నారు. చట్టసభల్లో ఎమ్మెల్యేలు మోటారు కార్మికుల సమస్యలు చర్చించి హామీల అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యు.శివాజీ, రావి కృష్ణ, దేవుడు, ఈశ్వర్, ఎస్.అప్పలరాజు, టి.రవి, తదితరులు పాల్గొన్నారు.

విషాదంలోనూ దాతృత్వం

మృతి చెందిన కుమారుడి నేత్రాలను దానం చేసిన తల్లిదండ్రులు



వైద్యురాలికి అంగీకార పత్రాన్ని అందజేస్తున్న కుటుంబ సభ్యులు

గోపాలపట్నం, మార్చి 4 (ఆంధ్ర జ్యోతి): కుమారుడు మృతి చెందిన దుఃఖంలో ఉన్నప్పటికీ పరులకు సహాయం చేయాలనే తపనతో అంత విషాదంలోనూ ఆ తల్లిదం డ్రులు దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇక్కడి లక్ష్మీనగర్‌కు చెందిన గోకా శివకృష్ణ మనస్తాపంతో సోమవారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో తీవ్ర విషాదంలో ఆ తల్లిదండ్రులు ఉన్నప్పటికీ తమ కుమారుడి కళ్లను దానం చేయడానికి ముందుకువచ్చారు. దీంతో మోహనిన్ ఐ బ్యాంక్ వైద్యులు మృతుడు శివకృష్ణ నేత్రాలను సేకరించారు. మృతుని తల్లిదండ్రులు దమయంతి, సోమేశ్‌ల సేవాగుణాన్ని స్థానికులు కొనియాడారు.

ఐపీఎల్‌కు స్టేడియం ముస్తాబు

మారుతున్న ఏసీఏ వీడీసీఏ స్టేడియం రూపురేఖలు

- డ్రెసింగ్ రూమ్స్, కార్పొరేట్ బాక్స్‌లలో ఆధునిక సౌకర్యాలు
- మరింత ప్రకాశవంతంగా వెలగనున్న ఫ్లడ్ లైట్లు
- శరవేగంగా ఆధునికీకరణ పనులు

(విశాఖపట్నం స్పోర్ట్స్, ఆంధ్రజ్యోతి):

ఐపీఎల్ మ్యాచ్‌లకు మరోసారి వేదికగా నిలుస్తున్న పీఎంపాలెంలోని ఏసీఏ వీడీసీఏ స్టేడియం సర్వాంగ సుందరంగా ముస్తాబవుతోంది. ఆంధ్ర క్రికెట్ సంఘం (ఏసీఏ) ఆధ్వర్యంలో రూ.కోట్ల వ్యయంతో చేపడుతున్న ఆధునికీకరణ పనులతో స్టేడియం రూపురేఖలు మారనున్నాయి. ఢిల్లీ క్యాపిటల్స్ హోం గ్రౌండ్‌గా ఈనెల 24న ఢిల్లీ క్యాపిటల్స్-లక్నో సూపర్ జెయింట్స్, ఈనెల 30న ఢిల్లీ క్యాపిటల్స్-సన్ రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లు జరగనున్న నేపథ్యంలో పనులను వేగవంతం చేశారు.

స్టేడియం ప్రధాన ముఖద్వార భవనం ఎదుట ఎలివేషన్ పూర్తిగా మారనుంది. భవనానికి రంగులద్దడమే కాకుండా ఇంటర్నేషనల్ స్టేడియాలను తలపించేలా ముందు భాగాన్ని మారుస్తున్నారు. లోపలికి ప్రవేశించిన వెంటనే లాబీలో క్రికెట్ లోగోల వాల్ క్రాఫ్ట్‌తో కొత్త కళ తీసుకువచ్చారు. లాబీలోకి వెళ్లిన వెంటనే కొత్త అనుభూతి కలిగే విధంగా మార్పులు చేపడుతున్నారు.

కాంతులీననున్న ఫ్లడ్‌లైట్లు

స్టేడియంలోని ఫ్లట్‌లైట్లు మరింత కాంతివంతంగా ప్రకాశించనున్నాయి. అంతర్జాతీయ క్రికెట్ రంగంలో వినియోగిస్తున్న అత్యాధునిక ఫ్లడ్‌లైట్లను ఈ స్టేడియంలో ఏర్పాటు చేశారు. ఇందుకోసం ఫిలిప్స్ కంపెనీతో రూ.8 కోట్లకు కాంట్రాక్టు కుదుర్చుకుని లైటింగ్ పనులు పూర్తి చేసినట్టు తెలిసింది. కాంతివంతమైన ఫ్లడ్‌లైట్లను అమర్చడంలోనే కాకుండా వాటి నిర్వహణలో కూడా ప్రపంచ వ్యాప్తంగా ఫిలిప్స్ కంపెనీ ప్రథమస్థానంలో ఉన్న నేపథ్యంలో ఏసీఏ ప్రతినిధులు ఖర్చుకు వెనుకాడకుండా స్టేడియంలోని ఫ్లడ్‌లైట్స్ ఆధునికీకరణ బాధ్యతను ఫిలిప్స్ కంపెనీకి అప్పగించారని సమాచారం. దీంతో ఈనెల 24, 30న జరిగే ఐపీఎల్ మ్యాచ్‌లను వీక్షించే అభిమానులకు ఫ్లడ్ లైట్స్ వెలుగులు సరికొత్త అనుభూతిని అందించనున్నాయి.



స్టేడియంలో ఆకర్షణీయంగా లాబీ







ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఆధునికీకరణ పనులు

మారిన డ్రెసింగ్ రూమ్స్

ప్రతి అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆటగాళ్ల డ్రెసింగ్ రూమ్స్‌లో చిన్నచిన్న మార్పులు చేసేవారు. కొత్త కార్యవర్గం అనవసర ఖర్చులకు తావివ్వకుండా పూర్తిస్థాయిలో అత్యాధునిక సదుపాయాలతో డ్రెసింగ్ రూమ్‌లను ఆధునికీకరిస్తున్నారు. ప్రతి ఆటగాడు తన కిట్ బ్యాగ్‌ను భద్రపరచుకునేందుకు లాకర్స్ మాదిరిగా 20 కప్‌బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే డ్రెసింగ్ రూమ్స్‌లో అత్యాధునిక మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.

కార్పొరేట్ బాక్స్‌లలో సదుపాయాలు

వీవీఐపీ, వీఐపీ ప్రేక్షకుల కోసం ఏర్పాటు చేసిన కార్పొరేట్ బాక్స్‌లను పూర్తిగా ఆధునికీకరించి అత్యాధునిక సదుపాయాలు సమకూర్చుతున్నారు. టికెట్ ధరకు తగ్గట్టుగా సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. కార్పొరేట్ బాక్స్‌లో ఏసీ, లైటింగ్, ఇతర సౌకర్యాలు ఆధునిక పద్ధతిలో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఒక్కో కార్పొరేట్ బాక్స్‌కు పరిమిత సీట్లను మాత్రమే ఏర్పాటుచేయగా గ్లాస్ డోర్‌తో కూడిన ఏసీ బాక్సులో 20 సీట్లు...అదే బాక్సుకు సంబంధించి ఓపెన్‌లో కూర్చొని మ్యాచ్‌ను వీక్షించేందుకు మరో 20 కుర్చీలను అందుబాటులో ఉంచుతున్నారు.

గ్యాలరీలపై ప్రత్యేక దృష్టి

గ్యాలరీలలో శిథిలావస్థకు చేరిన కుర్చీల స్థానంలో కొత్తవి అమర్చారు. ఐపీఎల్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ఈ కుర్చీలను పూర్తిస్థాయిలో మార్చే ఆలోచనలో ఏసీఏ ప్రతినిధులు ఉన్నారని తెలిసింది. అలాగే స్టేడియం సామర్థ్యం పెంచే ఆలోచన చేస్తున్నారని తెలిసింది. దానిపై అనుభవజ్ఞులైన ఇంజనీర్లతో చర్చిస్తున్నారని సమాచారం. ఇక గ్యాలరీలోని ప్రేక్షకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను ఆధునికీరిస్తున్నారు.

మహిళా ప్రేక్షకుల కోసం

మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే మహిళ ప్రేక్షకుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రత్యేకంగా వాష్ రూమ్స్ ఏర్పాటుచేశారు. తగిన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు.

రూ.40 కోట్లతో స్టేడియం అభివృద్ధి చేస్తున్నాం

- ఈ నెల 24, 30 తేదీల్లో ఐపీఎల్ మ్యాచ్‌లకు సిద్ధం
- ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని



స్టేడియంను పరిశీలిస్తున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ, తదితరులు

మధురవాడ , మార్చి 4 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియాన్ని రూ.40 కోట్లతో అభివృద్ధి చేసినట్టు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని చిన్ని తెలిపారు. ఈ నెల 24, 30 తేదీల్లో జరగనున్న ఐపీఎల్ మ్యాచ్‌లకు అనుగుణంగా స్టేడియాన్ని ఆధునికీకరించినట్టు చెప్పారు. సోమవారం స్టేడియంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 24న ఢిల్లీ కేపిటల్స్ లక్నో సూపర్ జెయింట్స్, 30న ఢిల్లీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయన్నారు. వీటికోసం రూ.9.5 కోట్లతో అధునాతన ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటుచేశామన్నారు. సీటింగ్ కెపాసిటీ కూడా పెంచినట్టు చిన్ని చెప్పారు. ఏసీఏ కార్యదర్శి సానా సతీష్ మాట్లాడుతూ బీసీసీఐ ఆశించిన విధంగా స్టేడియాన్ని అభివృద్ధి చేయడంతో ఈ ఏడాది మరికొన్ని మ్యాచ్‌లు వచ్చే అవకాశం ఉందన్నారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రతబాగ్చీ మాట్లాడుతూ మ్యాచ్‌లకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పార్కింగ్ స్థలాలు గుర్తించామన్నారు. ఈ సమావేశానికి ముందు కలెక్టర్ హరేంధిర్ ప్రసాద్, సీపీ, తదితరులు పిచ్‌పై సరదాగా కొంతసేపు బ్యాటింగ్ చేశారు. అనంతరం స్టేడియంలో అన్ని విభాగాలను పరిశీలించారు.

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు

సిరిపురం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు శానిటేషన్ కార్మికులుగా పనిచేస్తున్న వారికి సుప్రీంకోర్టు ఆదేశానుసారం సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, అమలుచేయని కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కనీసం వేతనం రూ.35 వేలు, బేసిక్ వేతనంతో పాటు డీఏ చెల్లించాలని, గ్రాట్యుటీ, ఇతర అలవెన్సులు ఇవ్వాలని, కుటుంబానికి మెడికల్ అలవెన్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జేడీ నాయుడు, రాజబాబు, అప్పలరాజు, గణేష్, మంగమ్మ, రాము, రమణ, గోవింద్, కాసుబాబు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ లైన్‌మన్‌కు జాతీయ అవార్డు



సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చైర్మన్ ఘన శ్యామ్ నుంచి అవార్డు అందుకుంటున్న గణేష్

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అత్యుత్తమ పనితీరు కనపరిచిన ఏపీ ఈపీడీసీఎల్ చింతూరు లైన్‌ఇన్‌స్పెక్టర్ కె.గణేష్ జాతీయ స్థాయి ఉత్తమ లైన్‌మన్ అవార్డు అందుకున్నారు. లైన్‌మన్ దివస్ సందర్భంగా మంగళవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ కెగణేష్‌కు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ చైర్మన్ ఘన శ్యామ్ అవార్డు అందించారు. వ్యవసాయ, వాణిజ్య, గృహ, పరిశ్రమల వినియోగదారులకు నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందేలా కృషిచేన ఏపీఈపీడీసీఎల్ లైన్‌ఇన్‌స్పెక్టర్‌కు జాతీయ అవార్డు రావడం హర్షణీయమని ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి పేర్కొన్నారు. ఆయనతో పాటు సంస్థ డైరెక్టర్లు డి.చంద్రం, వి.విజయలలిత, బి.రామచంద్రప్రసాద్ గణేష్‌కు అభినందనలు తెలిపారు.

'పది' పరీక్షలకు పక్కా ఏర్పాట్లు

- జిల్లాలో 29,997 మంది విద్యార్థులు
- మొత్తం 134 కేంద్రాల ఏర్పాటు
- జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

ఆరిలోవ, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 17వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాటు పక్కాగా చేస్తున్నామని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అర్బన్ ప్రాంతాల్లో 98, గ్రామీణ ప్రాంతంలో 56 మొత్తం 134 కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు 29,997 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. వీరిలో రెగ్యులర్ 28,523, ఓపెన్ 1,404 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. వీరిలో 15,094 మంది బాలురు, 13,429 మంది బాలికలున్నారన్నారు. రెగ్యులర్ విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు, కాంపొజిట్ ఒకేషనల్ విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. విద్యార్థుల సౌకర్యార్థం రోజు విడిచి రోజు పరీక్షలు నిర్వహించేలా విద్యాశాఖ షెడ్యూల్ రూపొందించిందన్నారు. జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు సజావుగా జరిగేలా సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

గీతంలో నాస్కామ్ కెరీర్ ఫెయిర్‌కు విస్తృత ఏర్పాట్లు

- ఇప్పటికే 33,682 మంది అభ్యర్థుల పేర్ల నమోదు

సాగర్‌నగర్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర ప్రదేశ్ ఉన్నత విద్యా మండలి, ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థలతో కలసి నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీసెస్ కంపెనీస్ (నాస్కామ్) ఈ నెల 5, 6 తేదీల్లో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కెరీర్ ఫెయిర్ కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనడానికి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 33,682 మంది అభ్యర్థులు తమ పేర్లు నమోదు చేసుకున్నట్టు నిర్వాహక కమిటీ తెలిపింది. కెరీర్ ఫెయిర్‌లో పాల్గొనేందుకు ఇంజనీరింగ్, తదితర సాంకేతిక విద్యార్హతలు గల వారితో పాటు ఆర్ట్స్, సైన్స్, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు పాల్గొనవచ్చు. సుమారు 50 ప్రముఖ కంపెనీలు కెరీర్ ఫెయిర్‌లో పాల్గొననున్నాయి. సుమారు 200 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులు బృందాలుగా ఏర్పడి కెరీర్ ఫెయిర్‌కు వచ్చేవారికి మార్గదర్శకం చేయనున్నారు. ఫెయిర్‌లో పాల్గొనే అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ అయిన వివరాలను గీతంలోని ఇంటర్వ్యూ విభాగాలలో చూపించి ప్రవేశానికి అనుమతి పొందాల్సి ఉంటుంది. అలాగే అందరూ తమ ఆధార్ కార్డుతో పాటు తమ విద్యార్హతలను ధ్రువీకరించే సర్టిఫికెట్లతో హాజరు కావాలని నిర్వాహకులు సూచించారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులు రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల నుంచి భీమిలి వైపు వెళ్లే బస్సుల ద్వారా 'గీతం'ను చేరుకోవచ్చు. ఈ కెరీర్‌ఫెయిర్‌ను నిరుద్యోగులందరూ సద్వినియోగం చేసుకోవాలని గీతం అధ్యక్షుడు, విశాఖ ఎంపీ శ్రీభరత్ కోరారు.

ప్రత్యేక బస్సులు నడపనున్న ఆర్టీసీ

ద్వారకాబస్‌స్టేషన్, మార్చి4 (ఆంధ్రజ్యోతి): గీతం కళాశాలలో బుధ, గురువారాల్లో జరగనున్న జాబ్ మేళాకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నట్టు రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు. రైల్వేస్టేషన్ నుంచి సిరిపురం, ఎంవీపీ కాలనీ మీదుగా గీతం కళాశాలకు (900కె రూట్) మూడు, ఎండాడ జంక్షన్ నుంచి రెండు, ఆనందపురం నుంచి కొమ్మాది మీదుగా ఎండాడ జంక్షన్ వరకు రెండు ప్రత్యేక బస్సులు నడుపుతామన్నారు. వివిధ ప్రాంతాల నుంచి ద్వారకాబస్‌స్టేషన్‌కు కనెక్టివీ కల్పించి, అక్కడి నుంచి గీతం కళాశాలకు ప్రత్యేక బస్సులు నడుస్తాయన్నారు. ఇందుకోసం ద్వారకాకాంప్లెక్సు సిటీబస్ టెర్మినల్ వద్ద ప్రత్యేక బస్టాపును ఏర్పాటు చేశామన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక సర్వీసులు నడుస్తాయన్నారు.

కుండకు కుదిరిన ట్యాప్!



వేసవిలో గొంతు తడి ఆరిపోతుంటుంది. దాహం తీర్చుకునేందుకు చల్లని నీళ్ల కోసం చూస్తుంటాం. ఫ్రిజ్ వాటర్ తాగితే గొంతు ఇన్‌ఫెక్షన్స్ వంటి ఇబ్బందులు తలెత్తుతాయి. దీంతో చాలా మంది చల్లని నీళ్ల కోసం సంప్రదాయ కుండలను ఆశ్రయిస్తున్నారు. వీటితో ఆరోగ్యం కూడా. ఈ నేపథ్యంలో కుండలకు డిమాండ్ పెరుగుతోంది. వినియోగదారులను ఆకట్టుకునేందుకు విక్రయదారులు వాటికి ప్రత్యేకంగా ట్యాప్‌లు బిగిస్తున్నారు. నగర పరిధిలో ఎక్కడచూసినా ఇలాంటి కుండలే కనిపిస్తున్నాయి. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ తరగతులు

ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్



ఉద్యోగులతో సమావేశమైన వీసీ, ఇతర అధికారులు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వ విద్యాలయ బోధనేతర సిబ్బందికి విభిన్న విభాగాలు, అంశాలపై విస్తృత అవగాహన కల్పించేలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ పేర్కొన్నారు. అకడమిక్ సెనేట్‌హాల్‌లో మంగళ వారం ఉదయం వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సూపరింటెండెం ట్లు, వివిధ విభాగాల అధిపతులతో ఆయన సమావేశమ య్యారు. ఈ సందర్భంగా ఆయన పరిపాలనా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది, వారి విధులను తెలుసుకున్నారు. వర్సిటీ ప్రతిష్టను పెంపొందించే దిశగా ప్రతి ఉద్యోగీ పని చేయాలని సూచించారు. అత్యుత్తమ విధానాలను వర్సిటీ లో అమలుచేస్తామన్నారు. ఇతరులు అనుసరించేలా ఇక్క డ ఉద్యోగుల పనితీరు ఉండాలన్నారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మరింత వేగంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. వర్సిటీ ప్రగతికి ప్రతి ఉద్యోగి తమ వంతు సహకారాన్ని అందించాలని, అప్పుడు ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. త్వరలో విభాగాల వారీగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం, సమీక్ష నిర్వహిస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ మీదుగా ప్రత్యేక రైళ్లు

విశాఖపట్నం, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): హోలీ రద్దీని దృష్టిలో ఉంచుకుని దువ్వాడ, విజయనగరం మీదుగా చెర్లపల్లి, షాలిమార్, సంత్రాగచ్చి, ఉధ్నా, కుర్దారోడ్డు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను ప్రవేశపెడుతున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు.

చెర్లపల్లి-షాలిమార్-చెర్లపల్లి 07703 నంబరు గల ప్రత్యేక రైలు ఈనెల 9, 16న (ప్రతి ఆదివారం) రాత్రి 7.45 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి మర్నాడు ఉదయం 9 గంటలకు దువ్వాడ, మంగళవారం వేకువజామున 2 గంటలకు షాలిమార్ చేరుతుంది. 07704 నంబరు గల రైలు ఈనెల 11, 18న (ప్రతి మంగళవారం) ఉదయం 5 గంటలకు షాలిమార్‌లో బయలుదేరి అదేరోజు రాత్రి 7.50కు దువ్వాడ, మర్నాడు ఉదయం 8.10 గంటలకు చెర్లపల్లి చేరుతుంది.

చెర్లపల్లి-సంత్రాగచ్చి-చెర్లపల్లి: 07705 నంబరు గల రైలు ఈనెల 7, 21న (ప్రతి శుక్రవారం) ఉదయం 7.15 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి అదేరోజు రాత్రి 7.45కు దువ్వాడ, మర్నాడు ఉదయం 10.30కు సంత్రాగచ్చి చేరుతుంది. 07706 నంబరు గల రైలు ఈనెల 8, 22న (ప్రతి శనివారం) మధ్యాహ్నం 12.35 గంటలకు సంత్రాగచ్చిలో బయలుదేరి మర్నాడు వేకువ జాము 3.50 గంటలకు దువ్వాడ, సాయంత్రం 4.40 కు చెర్లపల్లి చేరుతుంది.

ఉధ్నా-కుర్దారోడ్డు-ఉధ్నా: 09059 నంబరు గల రైలు ఈనెల 12, నుంచి ఏప్రిల్ 30 వరకు ప్రతి బుధవారం మధ్యాహ్నం 12.20 గంటలకు ఉధ్నాలో బయలుదేరి మర్నాడు సాయంత్రం 4 గంటలకు విజయనగరం, రాత్రి 10.30 గంటలకు కుర్దారోడ్డు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 09060 నంబరు గల రైలు ఈనెల 14 నుంచి మే రెండు వరకు ప్రతి శుక్రవారం వేకువజామున 2 గంటలకు కుర్దారోడ్డులో బయలుదేరి ఉదయం 7.25 గంటలకు విజయనగరం, మర్నాడు మధ్యాహ్నం 1.30 గంటలకు ఉధ్నా చేరుతుంది.

వెయిట్‌లిఫ్టింగ్‌లో ఏయూకు పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

విశాఖపట్నం, స్పోర్ట్స్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ టోర్నీలో ఆంధ్ర విశ్వవిద్యాలయం లిఫ్టర్లు పతకాలు సాధించారు. ధర్మశాలలో జరిగిన ఈ టోర్నీ 71 కిలోల విభాగంలో ఎస్.పల్లవి స్వర్ణ పతకం, 76 కిలోల విభాగంలో బి.జాస్సీ కాంస్య పతకం సాధించారు. అలాగే ఖేలో ఇండియా యూనివర్సిటీ టోర్నీ 87 కిలోల విభాగంలో సీహెచ్ లక్ష్మి స్వర్ణ పతకం, 71 కిలోల విభాగంలో ఎస్.పల్లవి రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా ఏయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్ మంగళవారం తన చాంబర్‌లో క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈఎన్.ధనుంజయరావు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్, విభాగాధిపతి, తదితరులు పాల్గొన్నారు.